# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :98 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేదీ: మంగళవారం 17-06-2025 | పేజీలు:4 వెల: 2.00


## మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన నీలం మధు ముదిరాజ్..

ఉమ్మడి మెదక్ : ఇటీవల నూతన మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కాంగ్రెస్ సీనియర్ నేత నీలం మధు ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించనున్న సందర్భంగా హైదరాబాద్ ఆరామ్ ఘర్ లోని మంత్రి నివాసంలో ఆయనను కలిసి పూలబొకే అందించి శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా నీలం మధుని మంత్రి ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ఆలింగనం చేసుకుని సాదరంగా ఆహ్వానించి ఇరువురు శాలువాలతో సత్కరించుకున్నారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని అమలు చేస్తూ అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి అందరం కలిసికట్టుగా పనిచేస్తూ మన వర్గాల సమస్యలు,ఆర్థికాభివృద్ధి, రాజకీయ అవకాశాలకు కృషి చేద్దామని చర్చించుకున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు కొత్త ఊపిరి.. వరంగల్‌లో మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు



వరంగల్ : వరంగల్ తూర్పులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా, పేదల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ మంత్రి కొండా సురేఖ పలు కీలక వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలోని పేదలందరికీ ఆవాసం కల్పించాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని ఆమె తెలిపారు. 15 సంవత్సరాల విరామం తర్వాత పేదలకు ఇళ్ల నిర్మాణం జరగడం ఎంతో గర్వకారణమని, ఇందుకు అనుకూలంగా ప్రభుత్వం రూ.22,500 కోట్లు వెచ్చించి నాలుగు సంవత్సరాల్లో 20 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించిందని వెల్లడించారు.ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించి ఎలాంటి అవకతవకలు జరగకుండా అధికారులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వివరాలు సేకరించాలని సూచించారు. అవినీతికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలన్నది తమ ధ్యేయమని పేర్కొన్నారు. కొండా సురేఖ మాట్లాడుతూ, తాను టీఆర్ఎస్ ప్రభుత్వంలో తూర్పు నియోజకవర్గ శాసన సభ్యురాలిగా ఉన్నప్పుడు కూడా ఇళ్ల కోసం కృషి చేసినప్పటికీ, అప్పటి కెసిఆర్ ప్రభుత్వం నుంచి సహకారం అందలేదని విమర్శించారు. "ఇప్పటికైనా ఇల్లు నిర్మించడం బీఆర్ఎస్ చేతకాదని ప్రజలకు అర్థమవుతోంది. వారు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేశారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇటీవల వరంగల్ తూర్పులో జరిగిన అభివృద్ధి గురించి మాట్లాడిన ఆమె, "నేను శాసనసభ్యురాలిగా పనిచేసిన సమయంలో చేసిన అభివృద్ధే ఇప్పటికీ ప్రజలకు కనిపిస్తోంది. గత ఎమ్మెల్యే ఏం చేశాడో ప్రజలే చెబుతున్నారు" అని విమర్శించారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి కూడు, గుడ్డా, నీడ కల్పించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని, లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మొదటి విడతలో అవకాశం రాకపోయినవారికి రెండవ విడతలో అవకాశం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అంతేకాదు, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్, ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని ఆమె గుర్తుచేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరుపైనే మంజూరు చేయనున్నట్లు తెలిపారు. చివరిగా, తూర్పు నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలందరికీ అండగా నిలబడి, అందరికీ సొంతింటి కల నెరవేర్చే దిశగా తాను పూనుకుంటానని మంత్రి కొండా సురేఖ ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణలో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధం..

హైదరాబాద్,మంత్రివర్గ విస్తరణ తరువాత సీఎం రేవంత్ రెడ్డి పాలనా పరంగా కీలక నిర్ణయాలకు సిద్ధమయ్యారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌లో వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాలు.. కేసీఆర్, కేటీఆర్ విచారణ ఎదుర్కొంటున్న వేళ.. రాజకీయంగా తన పట్టు నిరూపించుకోవాలని భావిస్తున్నారు. అందులో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ దిశగా రేవంత్ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రేపు తెలంగాణ మంత్రులతో సీఎం సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల తేదీలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందని ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు రావడానికి 15 రోజులు మాత్రమే గడువు ఉందన్నారు. మీ గ్రామాల్లో లోటుపాట్లు ఉంటే.. సరిదిద్దుకుని ఎన్నికలకు సిద్ధం కావాలని చెప్పారు. వారంలోగా అర్హులైన రైతులందరికీ రైతు భరోసా, బోనస్ ఇస్తామన్నారు పొంగులేటి.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఇదే సరైన సమయంగా సీఎం రేవంత్ భావిస్తున్నారు. ఇటీవల ముగ్గురు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసారు. కుల గణన తరువాత క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్‌కు ఆశాజనకంగా పరిస్థితి ఉందని అంచనా వేస్తున్నారు. మంత్రివర్గ విస్తరణలో వ్యూహాత్మకంగానే సామాజిక సమీకరణాలు అమలు చేసారు. ఇప్పుడు బీఆర్ఎస్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలు.. అటు కేసీఆర్.. ఇటు కేటీఆర్ వరుసగా విచారణలు ఎదుర్కొంటున్న వేళ ఎన్నికల నిర్వహణ విషయంలో పైచేయి సాధించవచ్చనే అంచనాలతో కాంగ్రెస్ ఉన్నట్లు తెలుస్తోంది. జెడ్పీటీసీ..



ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ తరువాత గ్రామ పంచాయతీ.. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే ఛాన్స్ కనిపిస్తోంది.అదే సమయంలో రిజర్వేషన్ల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉండనుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఇటీవల నాలుగు పథకాలను అమలు చేయటం ప్రారంభించటం, సన్నబియ్యం పంపిణీతో ప్రస్తుతం గ్రామీణ వాతావరణం రాజకీయంగా తమకు అనుకూలంగా ఉందనే అంచనాల్లో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. దీంతో, ఎన్నికలకు సిద్ధం అవుతున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పైన గ్రామీణ ప్రజల్లో వ్యతిరేకత ఉందని.. వచ్చే అన్ని ఎన్నికల్లోనూ సత్తా చాటాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. దీంతో, ఇప్పుడు ఎన్నికల సమరం తెలంగాణలో మరోసారి రాజకీయంగా ఉత్కంఠ పెంచుతోంది.

## తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై ఊహించని పరిణామం..

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ సారి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముహూర్తం మారే అవకాశం కనిపిస్తోంది. జమిలి ఎన్నికల దిశగా ఢిల్లీ కేంద్రం గా కీలక మంత్రాంగం కొనసాగుతోంది. రెండు దశల్లో జమిలి నిర్వహణ దిశగా కేంద్రం కసరత్తు కొనసా గుతోంది. 2029 పార్లమెంట్ ఎన్నికల్లో తొలి విడత జమిలి నిర్వహణ ఖాయంగా కనిపిస్తోంది. దీంతో, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సైతం 2029 పార్లమెంట్ ఎన్నికలతో పాటుగా నిర్వహించే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. అదే జరిగితే.. కలిసొచ్చేదెవరికి..

### కేంద్రం కసరత్తు

కేంద్రంలో బీజేపీ మూడో సారి అధికారంలోకి వచ్చిన తరువాత జమిలి పైన కసరత్తు వేగవంతం చేసింది. 2029లో తొలి విడత జమిలి నిర్వహించే యోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. దేశ వ్యాప్తంగా రెండు దఫాల్లో జమిలి ప్రక్రియ అమలు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. దీంతో, 2029లో కొన్ని రాష్ట్రాలతో కలిపి లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. 2034 నాటికి మిగతా రాష్ట్ రాలనూ కలిపి జమిలి జరగనుంది. 129వ రాజ్యాంగ సవరణ బిల్లుపై రాష్ట్రాలకు జేపీసీ రానుంది. అందరి అభిప్రాయాలు తీసుకొని తుది నిర్ణయం తీసుకోనున్నారు. అదే జరిగితే ఈ సారి తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు.. ఈసారి లోక్‌సభ ఎన్నికలతో కలిసి జమిలిగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### తెలంగాణ ఎన్నికలు

ఇందులో భాగంగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను 2029లో లోక్‌సభ ఎన్నికలతో పాటు నిర్వహిం చాలనే యోచనలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను తొలిదఫా జమిలిగా నిర్వహించాలని యోచిస్తున్నట్లు చెబుతున్నారు. కాగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు రాష్ట్ర అసెంబ్లీకి చాలా దఫాలు పార్లమెంటుతో కలిపే ఎన్ని కలు జరిగాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక జరిగిన 2014 ఎన్నికలు కూడా జమిలిగానే నిర్వహించారు. అయితే ఆ తర్వాత 2018లో నాటి కేసీఆర్ ప్రభుత్వం లోక్‌సభతో కాకుండా సుమారు ఐదు నెలల ముందుగానే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లింది.



2023లో ఎన్నికలు.. డిసెంబర్ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాయి. ఈ లెక్కన 2028 డిసెంబర్ నాటికి తిరిగి ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది.

### పార్లమెంట్ తో పాటుగా

అయితే, ఢిల్లీలో జరుగుతున్న ప్రచారం మేరకు తెలంగాణ అసెంబ్లీ ఎన్నిక లు 2029 లో పార్లమెంట్ తో పాటుగా జరుగుతాయని భావిస్తున్నారు. 2024 లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలతో పాటుగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కింల అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. మిగిలి న రాష్ట్రాల్లో అక్కడి షెడ్యూల్ కు అనుగుణంగా జరుగుతున్నాయి. అయితే 2024 పార్లమెంటు ఎన్నికలకు సుమారు ఏడాది ముందుగానీ, ఏడాది తర్వాతగానీ అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రాష్ట్రా లను ఒక కేటగిరీగా తీసుకోవాలని కేంద్రం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అంటే 2028, 2029లో ఎన్నికలు జరగాల్సి ఉన్న రాష్ట్రాలను తొలి విడతలో పరిగణనలోకి తీసుకోనున్నారు. ఈ లెక్కన 2028లో తెలంగాణతోపాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. 2029లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, హరియాణ, జార?ండ్, మహారాష్ట్ర ఉన్నాయి. ఈ 16 రాష్ట్రాలకు 2029 పార్లమెంటు ఎన్నికలతో కలిపి జమిలి ఎన్నికలు నిర్వహించే ఆలోచన చేస్తున్నారు. దీంతో.. ఇదే జరిగితే రాజకీయంగా ఎన్నికలు ఎవరికి కలిసి వస్తాయనే అంచనాలు మొదలయ్యాయి.

## పేదలకు మేలు చేయడమే వికసిత్ భారత్ లక్ష్యం!



అమరావతి,దేశంలో పేదలకు మేలు చేయడమే వికసిత్ భారత్ లక్ష్యం అని బీజేపీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. భారతదేశంలో 80 కోట్ల మందికి రేషన్ అందిస్తున్నామన్నారు.ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం దేశంలో పేదరికం ఐదు శాతం తగ్గిందని పేర్కొన్నారు. ఎన్డీయే కూటమిని ప్రజలు ఏ విధంగా ఆశీర్వదిస్తున్నారో.. దానికి జవాబుదారీతనంగా పరిపాలన ఉందన్నారు. 11 సంవత్సరాల వికసిత భారతదేశపు అమృతకాలం సేవ సుపరిపాలన పేదల సంక్షేమానికి పెద్దపీట అని పురందేశ్వరి చెప్పుకొచ్చారు. బీజేపీ ఎంపీ పురందేశ్వరి నేడు రాజమండ్రిలో మీడియాతో మాట్లాడారు.'ఎన్డీయే కూటమిని ప్రజలు ఏ విధంగా ఆశీర్వదిస్తున్నారో.. దానికి జవాబుదారీతనంగా పరిపాలన సాగుతోంది. 11 సంవత్సరాలు వికసిత భారతదేశపు అమృతకాలం సేవ సుపరిపాలన పేదల సంక్షేమానికి పెద్దపీట. డిజిటల్ మాధ్యమాన్ని ఉపయోగించుకున్న కారణంగా అవినీతి రహిత పాలన అందించాం. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చేసుకొని.. జర్మనీని అధిక మించి ప్రపంచ స్థాయిలో 4వ స్థానంలోకి వెళ్లాము. త్వరలో జపాన్‌ను దాటి మూడోవ స్థానంలోకి చేరడానికి ప్రయత్నం చేస్తున్నం. ప్రధాని మోడీ పాలనపై ప్రతి ఏడాది లాగే ప్రోగ్రెస్ కార్డ్ ఇస్తున్నాం. దేశంలో పేదలకు మేలు చేయడమే వికసిత్ భారత్ లక్ష్యం. 11 ఏళ్లలో అవినీతి జరిగిందని ప్రధాని మోడీ వేలెత్తి చూపించుకోలేదు. భారతదేశంలో 80 కోట్ల మందికి రేషన్ అందిస్తున్నాము. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం దేశంలో పేదరికం ఐదు శాతం తగ్గింది' అని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు.

## అహ్మదాబాద్‌కు 'బోయింగ్' నిపుణులు.. ప్రమాదంపై విశ్లేషణ

అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న విమాన ప్రమాదంపై అన్నివైపుల నుంచి దర్యాప్తు జరుగుతోంది. తాజాగా ప్రమాదంపై విశ్లేషించేందుకు 'బోయింగ్' నిపుణులు సోమవారం అహ్మదాబాద్‌కు చేరుకున్నారు. 242 మందితో సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి లండన్‌కు బయలుదేరిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ కొద్ది క్షణాల్లోనే అహ్మదాబాద్‌లోని ఒక వైద్య కళాశాలపై కూలిపోయింది.ఈ ప్రమాదంలో 11 ఏ సీటులో కూర్చున్న ప్రయాణికుడు మినహా మిగిలిన అందరూ మృతిచెందారు. బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్‌ను 2023 జూన్‌లో సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ ఏడాది డిసెంబర్‌లో తిరిగి సమగ్ర తనిఖీలు చేయాల్సివుందని అధికారులు తెలిపారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్న అధికారులు కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ దొరికిందని ధృవీకరించారు. ఇది ప్రమాదానికి గల కారణాన్ని నిర్ధారించడంలో వారికి సహాయపడనుంది.ఆదివారం బీజే ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ప్రధాని నరేంద్ర మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ పికె మిశ్రాకు అధికారులు ఈ విషయాన్ని తెలియజేశారు. విమానంలో కీలకమైన డేటాను



రికార్డ్ చేసే పరికరం హాస్టల్ పైకప్పుపై లభ్యమయ్యింది. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబి) ప్రమాదంపై దర్యాప్తును ప్రారంభించింది. యూఎస్ నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు అంతర్జాతీయ ప్రోటోకాల్‌ల కింద సమాంతర దర్యాప్తును నిర్వహిస్తోంది.

## ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులు ప్రయోగం.. టెల్ అవీవ్‌లో అమెరికా ఎంబసీకి నష్టం



టెహ్రాన్:పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మొదలైన యుద్ధం తాజాగా భీకర స్థాయికి చేరింది. ఇరు దేశాలు నువ్వానేనా అన్నట్టుగా దాడులు చేసుకుంటున్నాయి.అయితే తాజాగా ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు కారణంగా టెల్ అవీవ్‌లో అమెరికా రాయబార కార్యాలయం స్వల్పంగా దెబ్బతింది. దీంతో రాయబార కార్యాలయాన్ని తాత్కాలికంగా మూసేశారు. ఈ మేరకు ఎక్స్ ట్విట్టర్ వేదికగా అమెరికా ఎంబసీ తెలిపింది. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొంది. ఇరాన్ క్షిపణి తాకడంతో స్వల్పంగా ఎంబసీ ధ్వంసమైందని పేర్కొంది. ఇజ్రాయెల్‌లోని అమెరికా ఎంబసీ సోమవారం మూసి ఉంటుందని స్పష్టం చేసింది.ఇరాన్ సోమవారం తెల్లవారుజామున ఇజ్రాయెల్‌పై కొత్త క్షిపణి దాడులను ప్రారంభించింది. దీంతో దేశవ్యాప్తంగా వైమానిక దాడుల సైరన్‌లను మోగించింది. ఈ దాడుల్లో కనీసం 67 మంది ఇజ్రాయెల్ పౌరులు గాయపడ్డారు. ఇజ్రాయెల్ పౌరులను ఇరాన్ లక్ష్యంగా చేసుకుందని.. తాము కూడా టెహ్రాన్ నివాసితులే లక్ష్యంగా భీకర దాడులు ఉంటాయని ఇజ్రాయెల్ రక్షణ శాఖ హెచ్చరించింది.ఇదిలా ఉంటే ఇరాన్‌పై ఇజ్రాయెల్ అణు దాడి చేస్తే.. పాకిస్థాన్ రంగంలోకి దిగి ఇజ్రాయెల్‌పై అణు దాడి చేస్తుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ లో సీనియర్ అధికారి, ఇరాన్ జాతీయ భద్రతా మండలి సభ్యుడు మొహ్సేన్ రెజాయ్ హెచ్చరించారు. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రెజాయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు పాకిస్థాన్ మాకు మద్దతు తెలిపినట్లు వెల్లడించారు. అంతేకాకుండా టెహ్రాన్ దగ్గర ప్రపంచానికి తెలియని శక్తివంతమైన ఆయుధాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు.

### కర్రలు, కత్తులతో అటవీశాఖ అధికారులపై తిరగబడ్డ ఆదివాసులు

ఏటూరు నాగారం : ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం రొయ్యూరు సమీపంలోని అడవిలో ఆదివాసులు వేసుకున్న గుడిసెలను కూల్చివేసినందుకు వచ్చిన అటవీశాఖ అధికారులపై కత్తులు, కర్రలతో ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తిరగబడ్డారు. గుడిసెలను అధికారులు తీసుక వచ్చిన జెసిబి, ట్రాక్టర్లను వెనక్కి పంపించారు. అటవీ శాఖ అధికారుల తీరుపై ఆదివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రొయ్యూరు గ్రామానికి చెందిన కొంతమంది ఆదివాసులు సమీపంలోని పోడు భూమిలో గత ఏడాది గుడిసెలు వేసుకున్నారు. తరచూ అటవీ శాఖ అధికారులు ఇబ్బంది పెడుతున్నప్పటికి తమకు నివాసానికి గుడిసెలు వేసుకున్నామని చెప్పుకుంటూ వచ్చారు.కాగా, సోమవారం ఉదయం సుమారు 60 నుంచి 80 మంది అటవీశాఖ అధికారులు, ఉద్యోగులు, 20 మంది పోలీసుల సహాయంతో అక్కడికి వెళ్లి గుడిసెలను తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో ఆదివాసులు అటవీశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసి గుడిసెల కూల్చివేతను అడ్డుకున్నారు. జెసిబికి అడ్డుపడ్డారు. కర్రలు, కత్తులతో తిరగబడ్డారు.

## మాపై అణు బాంబులు వేస్తే ఇజ్రాయెల్‌పై పాక్ ప్రతిదాడి చేస్తుంది : ఇరాన్



టెహ్రాన్: ఇజ్రాయెల్-ఇరాన్ (ఇజ్రాయెల్-ఇరాన్) మధ్య జరుగుతున్న దాడులు, ప్రతిదాడులతో ప్రస్తుతం పశ్చామాసియా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ ఇజ్రాయెల్ తమపై అణుబాంబును ప్రయోగిస్తే పాకిస్థాన్ (పాకిస్తాన్) రంగంలోకి దిగి ఇజ్రాయెల్‌పై అణుదాడి చేస్తుందని ఇరాన్ గుర్తించింది. ఈ మేరకు ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ జనరల్ మొహసిన్ రెజాయి (మొహ్సేన్ రెజాయ్) తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ఇరాన్ ప్రభుత్వం అధీనంలోని ఓ టెలివిజన్ ??ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రెజాయి మాట్లాడారు. 'ఇజ్రాయెల్ మాపై అణుదాడి చేస్తే.. పాకిస్థాన్ ఇజ్రాయెల్‌పై అణుబాంబును ప్రయోగిస్తుంది. ఈ మేరకు పాకిస్థాన్ నుంచి మాకు హామీ ఉంది' అని మొహసిన్ కాగా మొహిసిన్ ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్‌లో సభ్యుడిగా కూడా ఉన్నారు.టర్కీ, సౌదీ అరేబియా, పాకిస్థాన్ వంటి దేశాలతో కలిసి ఇస్లామిక్ ఆర్మీని ఏర్పాటు చేయాలని మొహసిన్ ప్రతిపాదించారు. కానీ ఆయా దేశాలు ఇరాన్ యూనిఫామ్ వేసుకోవడానికి సిద్ధంగా లేవని ఎంపిక. ఒక్క ఇస్లామిక్ దేశమైనా ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపితే రాత్రికి రాత్రే ప్రాంతీయ బలాబలాలు మారిపోతాయి.కాగా ప్రపంచంలో ప్రస్తుతం అణ్వాయుధాలున్న దేశాల జాబితాలో ఇజ్రాయెల్, పాకిస్థాన్ దేశాలు స్థానం దక్కించుకొన్నాయి. ఈ జాబితాలో ఇప్పటికే అమెరికా, రష్యా, ఫ్రాన్స్, భారత్, ఉత్తర కొరియా ఉన్నాయి.

### శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

తిరుమల : శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ దర్శించుకున్నారు. ఇవాళ ఉదయం విఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులు, ఏపీ మంత్రులు అనగాని సత్య ప్రసాద్ టీజీ భరత్ లతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వామి వారి శేష వస్త్రంతో


## సంపాదకీయం

మంగళవారం 17-06-2025

# విమానయాన రంగం పురోగమించాలి !


అహ్మదాబాద్ విమాన దుర్ఘటన నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవాల్సి ఉంది. ప్రధానంగా సాంకేతికంగా మరింత నైపుణ్య సాధించాలి. విమానయాన రంగంలో నైపుణ్యాలకు పెద్దపీట వేయాలి.విమనాలు బయలుదేరే ముందు కనీసం దాని సామర్థ్యం, లోపాలను పరిశీలించి ఓకే చేసిన తరవాతనే ప్రయాణానికి అనుమతి ఇవ్వాలి. ఇప్పటి వరకు అలాగే జరుగుతున్నా తాజా ఘటనతో లోపాలను వెలికి తీయాలి. అలాగే ఎయిరిండియా విమానం కూలడానికి రెండు ఇంజిన్లు ఫెయిల్ అయ్యాయని అంటున్నారు. అది ఢిల్లీ నుంచి బయలుదేరి వచ్చిందని అంటున్నారు. అలాంటప్పుడు ఈ ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై లోతుగా విశ్లేషణ చేయాలి. ఇకపోతే విమానయానరంగ నిపుణులను తయారు చేసుకునే అవసరం ఇప్పుడు వచ్చింది. ఈ రంగంలో ఇంజనీర్లయిన నిపుణుల కొరత ఉన్నట్లు తెలుస్తోంది. 146 కోట్లు ఉన్న దేశ జనాభాకు తగ్గట్లుగా ఇప్పటికీ విమానాలు లేవు. ఉన్నకొద్ది విమానాలు సామాన్యుల అవసరానికి అనుగుణంగా లేవు. ఇంకా విమానాశ్రయాలు నిర్మించాల్సి ఉంది. స్పీడ్ యుగంలో ప్రజలకు విమానయాన ప్రయాణం అందుబాటులోకి రావాలి. నాణ్యమైన సేవలు అందించేలా ఈ రంగాన్ని తీర్చిదిద్దాలి. ఇవన్నీ తర్కిస్తూ...తాజా ప్రమాద ఘటనపై విశ్లేషణ చేయాలి. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై నిపుణులతో చర్చించాలి. ఈ ఘటన ఎందుకిలా జరిగిందో లోతుగా అధ్యయనం చేయాలి. నిజానికి అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన ఒళ్ళు జలదరింపచేస్తోంది. ఆ పెనువిషాదం గుండెలను పిండేస్తున్నది. వందల కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. ఎందరో కలలను చిదిమేసింది. ఎయిరిండియా తప్పిదానికి వందలాది ప్రాణాలు గాల్లో కలిసి పోయాయి. అలవోకగా సముద్రాలను అధిగమించి, సునాయాసంగా వేలాదికిలోమీటర్లు దూసుకుపోవాల్సిన ఈ విమానం నేలకూలడంతో బతుకులు ఛిద్రం అయ్యాయి. నిత్యం వదదలాది విమానాలు క్షేమంగా గమ్యం చేరుస్తున్నాయి. వేలాది మంది తమ గమ్యాన్ని చేరుకుంటున్నారు. ఇలా ఎన్నో కలలతో తమ గమ్యానికి చేరుకుంటామన్న వారి జీవితాలు బుగ్గిగా మారాయి. ఎన్నో ఆశలు, ఆశయాలతో బయలుదేరిన వారంతా అర్థంతరంగా జీవితం చాలించారు. ఇందులో మరో విషాదమేమంటే ఏమీ తెలియని వైద్యవిద్యార్థులు భోజనానికి కూర్చున్న సమయంలో అనుకోని ప్రమాదం పిడుగులా దూసుకువచ్చిపడింది. దీంతో దాదాపు 33మంది మృతి చెందారని అంటున్నారు. నిజంగా వీరికోసం ఎందరో తల్లదండ్రులు కలలుకన్నారు. ఈ ప్రమాంతో ఇప్పటి వరకు 274మంది మృత్యువాత పడ్డారు. మరికొందరు ఇంకా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరంతా అతివిషాదంగా తమ జీవితాన్ని ముగించాల్సివచ్చింది. మహాశక్తిమంతమైన ఇంజన్లు కలిగిన , అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలు ఉన్న టాటాలు నడుపుతున్న విమానం లండన్‌లో నిక్షేపంగా దిగడానికి బదులు వందల అడుగులు లేవకుండానే కూలిన ఘటన మనకు గుణపాఠం కావాలి. మొత్తం విమానయాన రంగాన్ని ఆత్మపరిశీలనచేసుకోవాలి. విమనాల ఉత్పత్తి మొదలు సాంకేతకిత వరకు అన్నీ సమగ్ర అధ్యయనం చేయాలి. మాటలకు అందని మహావిషాదం ఇది. పట్టుమని తొమ్మిదివందల అడుగులు కూడా లేవలేక విమానం కుప్పకూలింది. విమాన ప్రమాదాల్లో సగానికి పైగా టేకాఫ్, లాండింగ్ సందర్భాల్లోనే జరుగుతాయి. తొలుత పక్షి ఢీకొన్నదేమోనన్న అనుమానాలూ ఉన్నాయి. టేకాఫ్ సక్రమంగా జరగలేదని, అందుకు తగినంత శక్తి సమకూరలేదని అర్థమవుతూనే ఉంది. ట్యాంక్ నిండా ఇంధనం ఉన్నా, సరఫరా వ్యవస్థల్లో లోపం ఉంటే, ఇంధనం సరిగా చేరక ఇంజన్ విఫలమవుతుంది. ఇంజన్ మీద అత్యంత భారం పడే టేకాఫ్ సందర్భం పైలట్ల నైపుణ్యానికీ, అనుభవానికీ కూడా ఓ విషమపరీక్ష. నిండుగా ఉన్న ఇంధనం నిక్షేపంగా గమ్యానికి చేర్చాల్సింది పోయి విమానం మొత్తం క్షణాల్లో భగ్గున మండేలా తోడ్పడింది. ఆ విమానం వైద్యవిద్యార్థుల హాస్టల్ మీద పడి, అనేక మంది ప్రాణాలు తీసింది. సమగ్ర పరీక్షలు చేయనిదే, ప్రయాణానికి నూరుశాతం అర్హమైనదని నిర్ధారణ కానిదే ఏ విమానమూ గాలిలోకి ఎగరదు. అత్యంత అనుభవజ్ఞులైన పైలట్, కోపైలట్‌కు ఏ మాత్రం అనుమానం కలిగినా ఈ ప్రయాణానికి అంగీకరించేవారే కాదు. ఇంతటి ఘోర ప్రమాదం జరిగిన తరువాత, మొత్తంగా బోయింగ్‌మీద, ప్రత్యేకించి ఈ తరహా విమానాలమీద అనుమానాలు ప్రచారంలోకి రావడం సహజం. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఈ విమానాలు నిక్షేపంగా తిరుగుతున్నాయి. ఎయిర్ ఇండియాను కొనుగోలు చేసిన సందర్భంలో టాటా సంస్థకు సంక్రమించిన విమానాల్లో కొన్నింటికి కాలం చెల్లడంతో వాటి ఆధునికీకరణ కూడా సాగుతోందని అంటారు. గత నెలలోనే నాలుగు వందల మిలియన్ డాలర్ల వ్యయంతో అది మలిదశ కార్యక్రమానికి నడుంబిగించింది. ఈ ప్రమాదం నేపథ్యంలో ఎయిర్ ఇండియా తన విమానాల సంపూర్ణ ప్రక్షాళనకు సిద్ధపడక తప్పదు. విమానాల ఆధునికీకరణకు సంబంధించి దేశీయ విమానయాన సంస్థలు ఎదుర్కొం టున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకొని వాటి తరఫున విదేశాలతో వ్యవహరించడం అవసరం. సాంకేతిక వైఫల్యాల నుంచి మానవ నిర్లక్ష్యం వరకూ ఈ ప్రమాదానికి దోహదం చేసిన అంశాలన్నింటినీ నిక్కచ్చిగా గుర్తించి, కఠినమైన చర్యలను చేపట్టడంతో పాటు, సరైన పరిష్కారాలను సాధించడం అవసరం. దేశీయంగా విమాన సాంకేతికతను బలోపేతం చేసుకోవాల్సిన అసవరం కూడా ఏర్పడింది. మనదశంలో ఐఐటిలు మొదలు అనేక ఇంజనీరింగ్ కాలజీల్లో చదువుతున్న లక్షల మంది యువ విద్యార్థుల్లో విమానరంగ విద్యపై శిక్షణ ఇవ్వాల్సి ఉంది. అలాంటి కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ రకంగా విద్యకు, ఉపాధికి లంకె వేసి దేశీయంగా విమానయాన రంగాన్ని బలోపేతం చేయాలి. మరిన్ని విమానాశ్రయాలను నిర్మించాలి. ప్రమాదాలపై తక్షణం అధ్యయనం చేయాలి. వాటిని ఆచరించి మున్ముందు అలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే మనం సమర్థంగా ముందుకు సాగగలం.

# నవ్విపోదురుగాక మీకేటి సిగ్గు!



అమరావతి,అధికారంలోకి వచ్చి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది పొడుగునా తాము ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ మేరకు నిలబెట్టుకోగలిగామో, ఎంత గొప్పగా పరిపాలన చేయగలిగామో చెప్పుకొని సంబరాలు జరుపుకోవాల్సిన సమయంలో ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం తీవ్రమైన విమర్శలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుప్రీంకోర్టు చేత చీవాట్లు కూడా తినాల్సి వచ్చింది. ఇలా ఎందుకు జరిగింది? ఏ రాజకీయపక్షమైనా తను చేసిన గొప్ప పనుల్ని చెప్పుకొని ప్రజల మన్ననలు పొందాలని కదా చూసేది! ఎందుకు జరిగిందంటే తాము చేసిన కొద్దో గొప్పో పనులను కూడా కమ్మేసే విధంగా ఆంధ్రప్రదేశ్ లో సాగుతున్న అక్రమ కేసుల పర్వం, అరెస్టుల పర్వం కారణం. ఇప్పటివరకు జరుగుతున్న ఈ తతంగానికి పరాకాష్ఠగా తొమ్మిదో తేదీన ప్రముఖ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేసి నాలుగు గంటల్లో చేరవలసిన బెజవాడకు ఒక రోజంతా తిప్పి తీసుకుపోయి రాత్రంతా పోలిస్ స్టేషన్ లో ఉంచి మరునాడు కోర్టుకు అప్పగించారు.కొమ్మినేని శ్రీనివాసరావును ఎందుకు అరెస్ట్ చేసినట్టు? ఆయన పనిచేస్తున్న టెలివిజన్ ఛానల్లో నిర్వహించే ఒక కార్యక్రమంలో విశ్లేషకుడిగా పాల్గొన్న మరో జర్నలిస్టు రాజధానిగా రూపుదిద్దాలని చంద్రబాబు నాయుడు కలలుకంటున్న అమరావతి మీద అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారు. ఆ పాత్రికేయుడు చేసిన వ్యాఖ్యను తిరిగి ఉచ్చరించడం సంస్కారం కాదు. అయితే ఆ పాత్రికేయుడు శ్రీనివాసరావు టాక్ షోలో ఒక్కసారి చేసిన ఆ వ్యాఖ్యను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాధినేత చంద్రబాబు నాయుడు వందిమాగధ మీడియా పదే పదే ఉచ్చరించి దేశమంతా వినేట్టు చేసింది.ఇందులో శ్రీనివాసరావు మీద కేసు పెట్టిన వాళ్ళ ఉద్దేశం అర్థం అవుతూనే ఉంది. అమరావతి పట్ల అవమానకర వ్యాఖ్యలు చేసినందుకు కాదు, మహిళలను కించపరిచినందుకు అని చెప్పాలని ప్రయత్నం. ఆ ప్రయత్నంలో భాగంగానే మహిళల చేత ఫిర్యాదులు ఇప్పించి కేసు కట్టారన్నది స్పష్టం. కొమ్మినేని శ్రీనివాసరావు ఇప్పుడు తమ రాజకీయాలను, తమ విధానాలను వ్యతిరేకిస్తున్నాడన్న కక్ష కారణంగా ఆయనను జైలుకు పంపాలన్న పథకరచన జరిగిందన్నదీ స్పష్టం. కొమ్మినేని మీద తెలుగుదేశం పార్టీవారి కక్షసాధింపు ఇది మొదటిసారి కాదు. గతంలో ఆయన పనిచేస్తున్న మరో ఛానల్లో యాజమాన్యం మీద ఒత్తిడి తెచ్చి శ్రీనివాసరావును ఉద్యోగంలోనుండి తొలగింపచేసిన ఉదంతం అందరికీ తెలుసు.అమరావతి అనే ఒక గొప్ప రాజధానీ నగరాన్ని నిర్మించాలని చంద్రబాబు కోరిక. ఉమ్మడి రాష్ట్రంనుంచి విడిపోయిన దగ్గరనుండి తాను అధికారంలో ఉన్న మొదటి ఐదు సంవత్సరాల్లో ఆయన అమరావతి గానం చేస్తూనే ఉన్నారు. దానికోసం అత్యంత సారవంతమైన దాదాపు 40 వేల ఎకరాల భూమిని రైతులనుంచి సేకరించారు. ఏటా మూడు నాలుగు పంటలు పండే ఆ భూములను నిస్సారం చేయవద్దని అభ్యంతరం తెలిపిన వాళ్ళు అనేకమంది ఉన్నారు. చంద్రబాబునాయుడుగారి రాజకీయాల్ని చాలాకాలం సమర్థించినవారు కూడా అందులో ఉన్నారు. సరే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతి ప్రాంతం కేవలం శాసన రాజధానిగానే ఉంటుందని, పరిపాలనకు అనుకూలంగా ఉన్న విశాఖపట్నం, న్యాయ సంబంధమైన వ్యవస్థల కోసం కర్నూలు ఇలా మరో రెండు రాజధానులుగా ముందుకు తీసుకుపోవాలన్న విధానాన్ని అనుసరించింది.చంద్రబాబునాయుడు మళ్ళీ అధికారంలోకి రాగానే అమరావతి గానం తిరిగి ప్రారంభించారు. అధికారంలో ఆయన ఉన్నారు కాబట్టి ఆయన విధానాలు, ఆయన పార్టీ విధానాలనుబట్టి పరిపాలన సాగుతుంది. ఇందులో ఎవరికీ సందేహం లేదు. అయితే ఆయన పరిపాలన సాగుతున్న తీరునుగాని, ఆయన తీసుకునే విధాన నిర్ణయాలనుగానీ ఎవరూ విమర్శించకూడదు, వ్యతిరేకించకూడదు అన్న అహంభావపూరిత ధోరణి కారణంగానే ఆంధ్రప్రదేశ్ లో ఇటువంటి అక్రమ కేసుల పరంపర కొనసాగుతున్నది. అందులోభాగంగానే కొమ్మినేని శ్రీనివాసరావు అనే ప్రముఖ పాత్రికేయునిమీద అనేకమంది చేత వివిధ ప్రాం తాల్లో కేసులు పెట్టించి అరెస్ట్ చేయించారు.కొందరు దళితుల చేత ఫిర్యాదు ఇప్పించిన కారణంగా ఆయన మీద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ కింద కూడా కేసు నమోదు చేయించారు. సులభంగా బెయిల్ రాకుండా చూడటానికి చేసిన ప్రయత్నం ఇది. ఆ టాక్ షో నిర్వహించిన శ్రీనివాసరావుగాని, అందులో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన విశ్లేషకుడుగాని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసుపెట్టే విధంగా ఎటువంటి వ్యాఖ్య చేయలేదు. ఈ కేసు విచారించిన కోర్టు అదే విషయంలో చీవాట్లు పెట్టింది. ఆ సెక్షన్ తొలగింప చేసింది కూడా. టాక్ షో నిర్వహించిన శ్రీనివాసరావు మీద కేసు ఏమిటి అంటూ సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టి, వెంటనే ఆయన విడుదలకు ఆదేశించింది. షరతులు ఏమన్నా ఉంటే కింది కోర్టు నిర్దేశిస్తుందని తెలిపింది. దీన్ని కూడా చంద్రబాబునాయుడుగారి వందిమాగధ మీడియా వక్రీకరించి రాసి తన ఉక్రోషాన్ని బయటపెట్టుకున్నది.ఇదంతా ఎందుకు జరుగుతున్నది అంటే కథ మొత్తం అమరావతి చుట్టే తిరుగుతుంది. అమరావతి అనే ప్రాంతాన్ని రాజధానిగా అభివృద్ధి చేస్తామన్న చంద్రబాబు నాయుడు ఆలోచన పట్ల తెలుగుదేశం పార్టీ, దాని మిత్రపక్షాలయిన జనసేన, భారతీయ జనతా పార్టీ, ఆయన వందిమాగధ మీడియా హౌసులూ తప్ప ఇతరులు చాలామంది పలు రకాల అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అందులో ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అమరావతిని రాజధానిగా అంగీకరించడం లేదు. తాను అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని మూడు ప్రాంతాల సమతుల అభివృద్ధి కోసం మూడు రాజధానుల ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. సరే, చట్టపరమైన చిక్కులు కావచ్చు, న్యాయపరమైన ఇబ్బందులు కావచ్చు అది సాధ్యపడలేదు. అసలు చంద్రబాబు నాయుడు తొలిసారి విభజిత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయినప్పుడే అమరావతి రాజధాని వ్యవహారంలో జపాన్ కు చెందిన ప్రముఖ ఆర్కిటెక్ట్ మాకి ఇది ఎంత లోపభూయిష్టమైన ఆలోచనో ఒక వ్యాసం రాసి మరీ వివరంగా తెలిపాడు.కేంద్రం ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సు చేసిన ప్రకాశం జిల్లా దొనకొండ ప్రాంతం కాదని చంద్రబాబు నాయుడు అమరావతిని రాజధానిగా ఎంచుకోవడాన్ని పలువురు వ్యతిరేకించారు. ఇందులో ఇన్ సైడర్ ట్రేడింగ్ జరిగిందనీ ఆరోపణలూ వచ్చాయి. చంద్రబాబు నాయుడు మొదటి అయిదేళ్ళ పాలనలో ఏ అభివృద్ధీ జరగని అమరావతిలో జగన్ మోహన్ రెడ్డి అధికారంలో ఉండగా విధ్వంసం సృష్టించాడని తలగడ సైజు గ్రంథాలు రచించిన మేధావులు కూడా ఉన్నారు చంద్రబాబు కొలువులో. అమరావతికి సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని రెండోసారి తీసుకొచ్చి మరోసారి శంకుస్థాపన చేయించారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. మొదటిసారి అమరావతి శంకుస్థాపనకు వచ్చినప్పుడు ప్రధానమంత్రి పార్లమెంటు మట్టి , యమున నీళ్లు తెచ్చి మా ముఖాన కొట్టి పోయారని ఇదే చంద్రబాబు నాయుడు 2018లో బీజేపీతో స్నేహం చెడిపోయాక విమర్శించిన విషయం ఇంకా ఎవరూ మరిచిపోలేదు.బహుశా అందువల్లనేమో ప్రధానమంత్రి ఈసారి నీళ్లు, మట్టి కూడా తీసుకురాలేదు, చంద్రబాబునాయుడుగారికి ఏమీ ఇవ్వలేదు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి మాత్రం ఒక చాక్లెట్ ఇచ్చి వెళ్లారు.సరే, చంద్రబాబు నాయుడు కలగంటున్న అమరావతి ఎప్పటికి సాకారం అవుతుంది అనేది మనకు ఇప్పుడు అప్రస్తుతం కానీ, తన కలల రాజధాని అమరావతీ నగర నిర్మాణం అనే ఆలోచన మీద ఈగ వాలినా సరే సహించను అనే ఆయన ధోరణినే అభ్యంతర పెట్టాల్సి వస్తున్నది. ఇప్పటికి సేకరించింది చాలదన్నట్టు మరో 40 , 50 వేల ఎకరాల భూమి సేకరించేందుకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తలపెట్టినట్టు వార్తలు వస్తున్నాయి. మొత్తంగా ఏటా మూడు, నాలుగు పంటలు పండే సారవంతమయిన భూమి ఆగమాగం కాబోతున్నదని ఆవేదన చెందడం తప్ప చెయ్యగలిగింది ఏమున్నది ఎవరయినా.ఈ వ్యవహారం అంతటినీ విమర్శిస్తున్నాడనే దుగ్ధ కారణంగానే సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు మీద అక్రమ కేసు, రాష్ట్రవ్యాప్తంగా సాక్షి కార్యాలయాల మీద దాడులు జరిగాయన్నది సుస్పష్టం. ఆ షోలో సదరు పాత్రికేయుడు మహిళలపట్ల చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలకు కేసు పెట్టిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మరి తమ పార్టీ నాయకుడు పట్టాభిని, బండారు సత్యనారాయణమూర్తిని, తన సొంత బావమరిది, ప్రముఖ సినీ నటుడు, అది మాత్రమే కాకుండా తెలుగు దేశంపార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, శాసన సభ్యుడు కూడా అయిన నందమూరి బాలకృష్ణను, మరికొందరు తెలుగుదేశంపార్టీ నాయకులను, రోజూ ఆయన భజన చేసే మీడియా సంస్థలకు చెందిన కొందరు యాంకర్లను మహిళలపట్ల చేసిన జుగుప్సాకర వ్యాఖ్యల కారణంగా కేసులు పెట్టి జైలుకు పంపాలి కదా.చివరగా రెండు విషయాలు చెప్పుకోవాలి. ప్రజాస్వామ్యానికీ, దానిలో అంతర్భాగమయిన పత్రికా స్వేచ్ఛకు ఆంధ్రప్రదేశ్ లోని కూటమి సర్కారు వల్లా, ఇతరేతర ప్రయోజనాల కోసం స్తబ్దుగా మారిపోతున్న పాత్రికేయ ప్రపంచం వల్లా తీరని విఘాతం జరుగుతున్నది. ప్రతిపక్షంలో ఉండగా చేసిన రెడ్ బుక్ ప్రతిజ్ఞ అమలులో భాగంగా పెడుతున్న కేసుల పరంపరలో ఒకటయిన కొమ్మినేని శ్రీనివాసరావు మీద కేసు నిలుస్తుందా లేదా, ఏం జరుగుతుందనే విషయం అలా ఉంచితే పత్రికా స్వేచ్ఛకు దీనివల్ల జరుగుతున్న నష్టంగురించి ఒక ఉదాహరణ చెప్పుకోవాలి. కొమ్మినేని అరెస్ట్ తరువాత ఒక యువ పాత్రికేయుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న ఒక నిర్ణయాన్ని విమర్శిస్తూ ఎక్స్ (ట్విటర్) లో ఒక ట్వీట్ చేస్తే, మరో సీనియర్ పాత్రికేయుడు ఆయనకు ఫోన్ చేసి 'భవిష్యత్తు ఉన్నవాడివి.. ఎందుకు ఇబ్బందులు కొనితెచ్చుకుంటావు?' అని శ్రేయోభిలాషి గానే హెచ్చరించాడు. ఈ ధోరణి కొనసాగితే పాత్రికేయం నిర్భయంగా సాగేదెలా? ఇది ప్రజాస్వామ్యానికి ఎంత ప్రమాదకరం? ఈ భయం తొలగించాల్సిన బాధ్యత ఎవరిది?

# బనకచర్లతో ఏపీ జలదోపిడీ నిజం.. కాంగ్రెస్ మౌనం.. మళ్లీ బీజేపీ ద్రోహం



హైదరాబాద్, కృష్ణా జలాల్లో జలదోపిడీ చేసినట్లుగా.. గోదావరి జలాలను కూడా బనక చర్ల ద్వారా ఏపీ దోపిడీ చేస్తున్నదని బీఆర్ఎస్ మాజీ మంత్రి టి.హరీష్ రావు ఆరోపించారు. శనివారం తెలంగాణ భవన్ లో "బనకచర్ల ప్రాజెక్ట్ పేరుతో ఏపీ చేస్తున్న జల దోపిడి– కాంగ్రెస్ మౌనం" అంశంపై హరీష్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ తెలంగాణకు నష్టం చేకూర్చే బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. చంద్రబాబుతో మీ దోస్తానా కోసం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెడతారా? అని ప్రశ్నించారు. కేటీఆర్ మీద, బీఆర్ఎస్ నాయకుల మీద అక్రమ కేసులు పెట్టడంలో ఉన్న శ్రద్ధ రాష్ట్ర ప్రయోజనాలను కాపడటంలో ఈ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. ప్రతిపక్షాల మీద ఇరిటేషన్ తప్ప, ఇరిగేషన్ మీద రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దృష్టి లేదని ఎద్దేవా చేశారు. గోదావరి బనకచర్లకు ఏపీ టెండర్లు పిలుస్తుంటే ఎందుకు నోరు మెదపడం లేదని..కృష్ణా నీళ్ళు తాత్కాలిక ఒప్పందానికి మించి ఏపీ తీసుకుపోతుంటే ఎందుకు మాట్లాడరని హరీష్ రావు నిలదీశారు.

నిధులు..నదులు ఆంధ్రకే అన్నట్లుగా బీజేపీ తీరు

నిధులు, నదులు రెండు ఆంధ్రకే అన్నట్లుగా బీజేపీ వ్యవహారం ఉందని హరీష్ రావు విమర్శించారు. తెలంగాణకు మొదటి నుంచి ద్రోహం చేస్తున్న బీజేపీ బనకచర్లకు సహకరిస్తూ మరో ద్రోహం చేస్తుందని మండిపడ్డారు. 8మంది బీజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా నిధుల్లో, నదుల్లో తెలంగాణకు అన్యాయం జరిగినా మాట్లాడటం లేదన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు ఉండి నోరు మెదపడం లేదని మండిపడ్డారు. 2టీఎంసీల బాబ్లీ ప్రాజెక్టు కోసం మహారాష్ట్ర మీద చంద్రబాబు పెద్ద పోరాటం చేశారని..మరి నేడు 200టీఎంసీల బనకచర్ల ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఎంత పోరాటం చేయాలని హరీష్ రావు ప్రశ్నించారు. తెలంగాణ కంటే పది రెట్ల నిధులు ఆంధ్రకి ఇచ్చినమని స్వయంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆంధ్రాలో చెప్పాడని గుర్తు చేశారు. కేంద్రంలో పరపతితో చంద్రబాబుపై నుండి కాకుండా పోలవరం నుండి నీళ్ళు మళ్ళించి, కేంద్రం నుండి నదుల అనుసంధానం పేరుతో నిధులు తెచ్చుకున్నారన్నారు. అయినా రేవంత్ రెడ్డికి, మంత్రులకు కదలిక లేదని విమర్శించారు. ఇప్పటికైనా కళ్ళు తెరవండని..నష్టం పూర్తిగా జరగకముందే గోదావరి బనకచర్ల ప్రాజెక్టు అడ్డుకావాలి అని డిమాండ్ చేస్తున్నామని హరీష్ రావు స్పష్టం చేశారు.

అడ్డుకోకపోతే చరిత్ర హీనుడిగా మిగిలిపోతావు

రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టవద్దని..సీఎం రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలు బంద్ చేయాలని..బనకచర్లను అడ్డుకోకపోతే చరిత్ర హీనుడిగా మిగిలిపోతావని హరీష్ రావు హెచ్చరించారు. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు మౌనం వీడి..చంద్రబాబు జల దోపిడిని అడ్డుకోవాలని డిమాండ్

# సామాజిక తెలంగాణ కోసం విద్యార్థులు పోరాడాలి

హైదరాబాద్,బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే ఊరుకోబోమని రేవంత్ సర్కారును ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్‌లో పెద్ద సంఖ్యలో చేరారు. వారికి కండువా కప్పి తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక తెలంగాణ సాధనకు విద్యార్థి లోకం కదిలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండి కొట్లాడారని.. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారన్నారు. అదే స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధన ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండాలని.. సామాజిక తెలంగాణను సాధించడానికి విద్యార్థులు నడుం బిగించాలన్నారు. బీసీ బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగానే.. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచన సరికాదన్నారు. బీసీలకు 42 రిజర్వేషన్లకు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కర్నాటకలో కులగణన ఎలా చేయాలో అక్కడి సీఎం సిద్ధరామయ్యకు నేర్పించానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారని.. సీఎం ఈ ప్రకటన చేసిన గంట సేపటికే కాంగ్రెస్ అధికారికంగా ఒక ఫోటో విడుదల చేసిందని.. ఆ ఫోటోలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఉన్నారని.. రేవంత్ రెడ్డి మాత్రం లేరన్నారు. దీన్ని బట్టే రేవంత్ రెడ్డి ఎన్ని అబద్ధాలు ఆడుతున్నారో అర్థమవుతుందన్నారు. రాహుల్ గాంధీ దర్శనం లేక సీఎం రేవంత్ రెడ్డి విలవిలలాడు తున్నారని.. దర్శనాల సంగతి పక్కనబెట్టి ప్రజా సమస్యలపై సీఎం దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ స్కూల్, టీడీపీ కాలేజీలో చదువుకున్నానని.. జాబ్ కాంగ్రెస్ లో చేస్తున్నానని సీఎం అన్నారని.. చేస్తున్న జాబ్‌లో కూడా రేవంత్ రెడ్డికి పాస్ మార్కులు రావడం లేదని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి వెళ్లడంలో రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ చేశారని.. కనీసం మంత్రివర్గాన్ని కూర్పు చేసుకోలేని సీఎం రేవంత్ రెడ్డి అని.. ఇంత అసమర్థ, బలహీన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఇంత బలహీనంగా లేకుండేనని.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని రేవంత్ రెడ్డి ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలు, విద్యారంగ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని.. దాదాపు రూ.8వేల కోట్ల మేర ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు ఉన్నాయని.. తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్య భరోసా కార్డులు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని విస్మరిస్తోందని.. తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం మెరుపులా పనిచేయాలని సూచించారు.

# ఐదో అంతస్థునుంచి దూకి మహిళ ఆత్మహత్య

హైదరాబాద్,సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎర్రగడ్డలోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ఓ మహిళ 5వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు– పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం 8:30 గంటల సమయంలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం... ఆత్మహత్య చేసుకున్న మహిళ పేరు కొక్కినీ శ్రావణి (30), ఆమె తిమ్మాపురం, ఏలూరు జిల్లా వాసిగా గుర్తించారు. . కొద్ది నెలల క్రితమే హైదరాబాద్‌కు వలసవచ్చి, జనప్రియ అపార్ట్‌మెంట్‌లో హౌస్ కీపింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నట్టు– తెలుస్తోంది. ఆమెకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. కుటుంబ కలహాలే ఆమె ఆత్మహత్యకు కారణమై ఉంటాయని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు– పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ సంఘటనతో అపార్ట్‌మెంట్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# డేరింగ్ ఆపరేషన్

టెల్ అవీవ్ : తాజాగా ఇజ్రాయిల్ ఇరాన్ మీద విరుచుకుపడుతోంది. ముఖ్యంగా, ఇరాన్ అణు కార్యక్రమాలపై, వారి సైంటిస్టులను టార్గెట్ చేసి దాడులు చేసింది. 2005 నుంచి ఇజ్రాయిల్ ఇరాన్ అణు కార్యక్రమాలను నిశితంగా గమనిస్తోంది. ప్రస్తుతం, ఇరాన్ అణ్వాస్త్రాలకు అవసరమయ్యే యూరేనియాన్ని శుద్ధి చేసినట్లు అనుమానిస్తున్న ఇజ్రాయిల్, భారీ దాడులు చేసింది.అయితే, ఇజ్రాయిల్ ఆపరేషన్స్ ఇదే మొదటిసారి కాదు. 1981లో ఇరాక్ పై కూడా ఇలాగే దాడులు చేసింది. జూన్ 7, 1981లో 14 ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు సినాయ్ ద్వీపకల్పంలోని ఎట్జియన్ ఎయిర్ బేస్ నుంచి బయలుదేరి, రెండు గంటల కన్నా తక్కువ సమయంలోనే ఇరాక్ రాజధాని బాగ్దాద్‌పై దాడులు చేశాయి. బాగ్దాద్‌కి సమీపంలో ఉన్న ఒసిరాక్ అణు రియాక్టర్‌పై ఇజ్రాయిల్ ఫైటర్ జెట్లు విరుచుకుపడ్డాయి. ఏకంగా 1100 కి.మీ ప్రయాణించి ఇజ్రాయిల్ సైన్యం ఈ దాడి చేసింది. "ఆపరేషన్ ఒపెరా" అనే కోడ్‌నేమ్ తో నిర్వహించిన ఈ దాడి అప్పట్లో సంచలనంగా నిలిచింది.సరిగా నాలుగు దశాబ్దాల తర్వాత, ఇప్పుడు ఇరాన్ వంతు వచ్చింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్ వంతు వచ్చింది. శుక్రవారం ఉదయం నుంచి ఇజ్రాయిల్ దాడులు మొదలు పెట్టింది. దీనికి ప్రతీకారంగా ఇజ్రాయిల్ వాణిజ్య రాజధాని టెల్ అవీవ్‌పై ఇరాన్ క్షిపణి దాడులు చేసింది.

సద్దాం హుస్సేన్ ఆశలు ఆవిరి:

ఇరాక్ అణు కార్యక్రమం 1950 చివర్లో ప్రారంభమైంది. అయితే, 1970లో సద్దాం హుస్సేన్ హయాంలో ఈ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. 1976లో ఇరాక్ ఫ్రాన్స్‌తో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఫ్రెంచ్ ప్రభుత్వం ఇరాక్‌కు 70 మెగావాట్ల పరిశోధన రియాక్టర్‌ను సరఫరా చేసేందుకు అంగీకరించింది. రియాక్టర్ డిజైన్ పేరు ఒసిరాక్. ఒసిరాక్ తో పాటు బాగ్దాద్ కు ఆగ్నేయంగా తువైతా న్యూక్లియర్ రీసెర్చ్ సెంటర్ లో తముజ్ –2 అనే చిన్న ట్రైనింగ్ రియాక్టర్ నిర్మాణం జరుగుతోంది.అంతర్జాతీయ అణుశక్తి సంస్థ కింద ఉన్న రియాక్టర్‌లను అధికారికంగా శాంతియుత ప్రయోజనాల కోసం నియమించారు. అయితే, ఒకసారి రియాక్టర్ ప్రారంభమైన తర్వాత దీనిని ఆయుధ గ్రేడ్ ప్లూటోనియం ఉత్పత్తి చేయడానికి ఒసిరాక్‌ని తిరిగి ఉపయోగించవచ్చని ఇజ్రాయిల్ నిఘా పసిగట్టింది. ఇది తన ఉనికికి ముప్పుగా మారుతుందని భావించింది. అయితే, రియాక్టర్ ఆపరేషనల్ స్టేటస్‌కి చేరుకున్న దానిని నాశనం చేయడం ప్రమాదమని ఇజ్రాయిల్ భావించింది.

ఇజ్రాయిల్ ఆపరేషన్:

అప్పటి ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) చీఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాఫెల్ ఈటన్ ఆధ్వర్యంలో ప్లాన్ ప్రారంభమైంది. రాజకీయ, సాంకేతిక కారణాల వల్ల ఆపరేషన్ పదేపదే ఆలస్యం అయింది. ప్రారంభ దశల్లో, ఇజ్రాయెల్ వైమానిక దళం F-4 ఫాంటమ్ ఫైటర్ జెట్‌లను ఉపయోగించాలని ప్రణాళిక

# తొలకరి ఆలస్యంతో రైతుల్లో ఆందోళన

హైదరాబాద్, ప్రస్తుత వాతావరణం చూస్తుంటే ఇంకా ఎండాకాలం ఉందా లేక వానాకాలమేనా అన్నట్లుగా ఉంది. రుతుపవనాలు వచ్చి పక్షం రోజులు దాటినా పూర్తిస్థాయిలో వర్షాలు కురియడం లేదు. వర్షాలు ముఖం చాటేయడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. తొలకరి రాక ఆలస్యం కావడంతో ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు రైతులు సిద్దంగా ఉన్నారు. కొన్నిచోట్ల పత్తి నాటుకున్నారు. దీంతో ఆ రైతుల్లో ఆందోళన తీవ్రం అవుతోంది. గత వారంరోజులుగా వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే మండుటెండలు, వడగాల్పులు చూస్తుంటే మరో వారం దాకా తొలకరి చిలకరించే పరిస్థితి కానరావడం లేదు. ఇప్పటికే నైరుతి తొందరగా వచ్చింది. అయినా సకాలంలో వర్ృషాలు కరియడం లేదు. దీంతో సాగు భూములకు నీరు లేక నెర్రెలు బారుతున్నాయి. తొలకరి వర్షాలతో విత్తనాలు మొలకెత్తాల్సిన సమయమిది. వర్షాలు లేకపోవడం వల్ల మొలిచిన మొక్కలు ఒక పక్క ఎండుతుండగా, మరో పక్క సాగు భూములు నెర్రులు పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. కనీసం ఒక్క చినుకైనా గట్టిగా కురియకపోతే విత్తులు మురిగిపోవడం ఖాయంగా కనినిస్తోంది.మృగశిర కార్తె ప్రారంభంలోనే వర్షాలు కురియడం ఆనవాయితీ. అప్పుడే విత్తనాలు వేస్తారు. ఓ వైపు వ్యవసాయాధి కారులు హెచ్చరిస్తున్నా వినలేదు. దుక్కులు దున్ని చాలా మంది రైతులు విత్తనాలు నాటుకునేందుకు సమాయత్తం అవుతున్న తరుణంలో వర్షాలు లేకపోవడంతో రైతులు ఆకాశం వైపు ఆందోళనతో చూస్తున్నారు. ఇక మొలచిన మొక్కలను బతికించుకొనేందుకు రైతులు పడుతున్న బాధలు వర్ణణాతీతం. వర్షాధారంపైనే ఆధారపడిన రైతులు అష్టకష్టాలు పడుతన్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే అన్నదాతలకు కష్టాలు వెంటాడుతుండటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. చాలాచోట్ల ఎక్కువ మంది రైతులు వాణిజ్య పంట అయిన పత్తి పంటనే సాగు చేస్తారు. వర్షాకాలం ప్రారంభంలోనే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి ఖరీఫ్‌కు సిద్ధమయ్యారు. ఈసారి వర్షాలు ఆలస్యం కావడంతో ఎప్పుడు పడతాయోనని వాపోతున్నారు. నైరుతి రుతుపవనాలు మే నెలాఖరుకే రాష్ట్రాన్ని తాకాయి. రెండు రోజుల్లో తెలంగాణలోని మరికొన్ని జిల్లాలకు, ఆ తర్వాతి రెండు రోజుల్లో రాష్ట్రమంతా విస్తరిస్తాయని వెల్లడించింది. వాతావరణంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల రాకతో పలు జిల్లాల్లో వానలు పడ్డాయి. ఉరుములు, మెరుపుతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. భారీ వర్షాలు కురిసే చాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

## విమాన ప్రమాద బాధితులకు 25లక్షల తక్షణ సాయం

న్యూఢిల్లీ,:విమాన ప్రమాద బాధితులకు ఎయిర్ ఇండియా సంస్థ తక్షణ ఆర్థిక సాయం ప్రకటించింది. మధ్యంతర సాయం కింద బాధితులకు రూ. 25 లక్షలు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. బాధితులకు గతంలో టాటా సన్స్ ప్రకటించిన రూ. కోటి ఆర్థిక సాయానికి ఇది అదనమని పేర్కొంది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎయిర్ ఇండియా పోస్టు పెట్టింది. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు తాము అన్ని రకాలుగా అండగా ఉంటామని ఎయిర్ ఇండియా పేర్కొంది. బాధిత కుటుంబాలకు సాయం కోసం క్షేత్రస్థాయిలో తమ బృందాలు

# మంత్రివర్గ విస్తరణలో సోషల్ ఇంజినీరింగ్ వ్యూహం విజయవంతమైందా?

హైదరాబాద్,తెలంగాణ స్వరాష్ట్రంలో జరిగిన మొదటి రెండు (2014, 2018) అసెంబ్లీ ఎన్నికల్లో, కేసీఆర్ నేతృత్వంలో టీఆర్ఎస్ పార్టీ గెలిచి అధికారాన్ని చేపట్టింది. తొమ్మిదిన్నర ఏండ్ల కేసీఆర్ పార్టీ పాలనను చూసిన ప్రజానీకం, 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించారు. దాదాపు 40 ఏండ్ల తర్వాత తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ మొత్తం 119 స్థానాల్లో సగానికి పైగా స్థానాలు గెలిచి, అధికారాన్ని హస్తగతం చేసుకుంది. మొత్తం గెలిచిన సీట్లోల్లో ఓసీలు 34 (53%), బీసీలు 7 (11%), ఎస్సీలు 14 (22%), ఎస్టీలు 9 (14%) ఎమ్మెల్యే స్థానాల్ని సాధించారు.రాజ్యాంగ నిబంధనల ప్రకారం, 119 స్థానాలున్న శాసన సభలో 15% కంటే ఎక్కువ కాకుండా గరిష్టంగా 18 మంత్రి పదవులు ఉండవచ్చు. అయితే కాంగ్రెస్ పార్టీ వర్గాల వారీగా గెలిచిన 64 సీట్ల నిష్పత్తి ఆధారంగా కాకుండా, మంత్రి పదవులను సామాజిక కోణంలో ఆలోచించి, వివిధ సమీకరణాల ఆధారంగా ఆయా సామాజిక వర్గాలకు కేబినెట్‌లో చోటు కల్పించినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు నియమితులైన 15 మంది మంత్రుల్లో ఓసీ కేటగిరి నుండి ముఖ్యమంత్రితో పాటు ఆరుగురు మంత్రులు, బీసీ కేటగిరి నుండి ముగ్గురు, ఎస్సీ కేటగిరి నుండి నలుగురు మంత్రులతో పాటు స్పీకర్, ఎస్టీ సామాజిక వర్గం నుండి ఒక మంత్రితో పాటు డిప్యూటీ స్పీకర్ ఉన్నారు.

### పెండింగ్‌లో మరో 3 మంత్రి పదవులు..

గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రాన్ని మేమే ఇచ్చినమని చెప్పుకున్న కాంగ్రెస్ పార్టీకీ ప్రజలు మొదటిసారి అధికారాన్ని అప్పజెప్పారు. రేవంత్ రెడ్డి సర్కార్ కొలువుతీరి ఏడాదిన్నర కాలం గడిచింది. ఇక మిగిలింది మూడున్నర ఏండ్లు.. అందులో చివరి ఆరు నెలలు ఎన్నికల హడావుడి, టికెట్ల కేటాయింపు ఇతరత్రా వ్యవహారాలు ఉంటాయి. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నర తర్వాత కూడా ఇంకా ఆరు మంత్రి పదవులను భర్తీ చేయాల్సి ఉండగా మూడింటిని భర్తీ చేసి మరో మూడింటిని పెండింగ్‌లో పెట్టారు. ఈ నేపథ్యంలో సామాజిక న్యాయం, సమీకరణాలు, సోషల్ ఇంజినీరింగ్ అనే భావనలు తెరపైకి వచ్చాయి. అయితే కాంగ్రెస్ హైకమాండ్ సోషల్ ఇంజినీరింగ్ వ్యూహం ప్రకారం మంత్రివర్గ విస్తరణ చేపట్టినట్టు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు..

### వ్యూహాత్మకంగా సోషల్ ఇంజినీరింగ్

అధికారం సాధించాలన్న లక్ష్యంతో సీట్ల కేటాయింపులో సోషల్ ఇంజినీరింగ్‌ను పక్కనపెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని అమలు చేయడం వల్ల గెలిచిన సీనియర్ ఎమ్మెల్యేలు, గతంలో మంత్రులుగా అనుభవం ఉన్న నాయకులు పదవులు ఆశించడం సహజం. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉండటం వల్ల, ఈ మంత్రివర్గ విస్తరణ రాబోయే ఎన్నికల్లో పార్టీ భవితవ్యం మీద ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి. అందుకే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కాకుండా ఫలితాల తర్వాత ఈ సోషల్ ఇంజినీరింగ్‌ను వ్యూహాత్మకంగా అమలు చేసింది. ఆశావహులను సముదాయిస్తూ మరో మూడు



మంత్రి పదవులను స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత భర్తీ చేయనున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో, ఈ పదవులు ఎవరికి దక్కుతాయన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

### మంత్రివర్గ విస్తరణతో సరిపోదు..

మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లాల వారీగా అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం లేదు. రాబోయే రోజుల్లో ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుండి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో అన్ని వర్గాల ప్రజలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం అందాలి.

కానీ, ఒక వర్గానికి మంత్రివర్గంలో స్థానం కేటాయించినంత మాత్రాన ఆ వర్గానికి సంపూర్ణ సామాజిక, రాజకీయ న్యాయం జరిగినట్టు కాదు. ఇంకా అనేక కులాల వారికి చట్ట సభల్లో రాజకీయ ప్రాతినిధ్యం లేదు. అటువంటి వర్గాలకు ఎమ్మెల్సీలు, రాజ్యసభ ఎంపీలు, నామినేటెడ్ పదవుల ద్వారా సముచిత ప్రాధాన్యత ఇవ్వడమన్నది అన్ని రాజకీయ పార్టీల బాధ్యత. సోషల్ ఇంజినీరింగ్ అనే భావనను కేవలం మంత్రివర్గ విస్తరణకు పరిమితం చేస్తే సరిపోదు.. కుల, మత, వర్గాలకు అతీతంగా తెలంగాణ ప్రజానీకానికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు సమగ్రంగా అందినప్పుడే అధికార కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విశ్వసనీయత పెరిగేది.

### పాత, కొత్త నేతల మధ్య సమన్వయం..

రాబోయే రోజుల్లో స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంత్రి పదవులు దక్కని సీనియర్ నేతలు పార్టీ గెలుపు కోసం పనిచేస్తారా? లేదా అన్న చర్చ జరుగుతోంది. పదేళ్ల ప్రతిపక్షంలో ఉంటూ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారు.. కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని హస్తగతం చేసుకున్న తర్వాత పదవుల్ని ఆశించడంలో తప్పేమీ కాదు. ఈ తరుణంలో కొత్త, పాత నాయకుల మధ్య పార్టీ అధిష్టానం సమన్వయాన్ని సాధించి ముందుకు సాగే ప్రయత్నం చేస్తారో లేదో చూడాలి. స్థానిక ఎన్నికల్లో వెలువడే ఫలితాలు ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనకు రిఫరెండం అని అధికార, విపక్షాలు భావిస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎవరి పక్షాన నిలుస్తారన్నది కాలమే నిర్ణయిస్తుంది.

# ఏపిలో డిఎస్సీ పరీక్షలు వాయిదా

అమరావతి,ఆంధ్రప్రదేశ్ లో ఈ నెల 20,21 తేదీల్లో జరగాల్సిన డీఎస్సీ పరీక్షలు వాయిదా పడ్డాయి.జులై 1,2 తేదీల్లో ఈ పరీక్ష నిర్వహిస్తామని డీఎస్సీ కన్వీనర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంటర్నేషనల్ యోగా ను ఘనంగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. జూన్21న విశాఖలో జరిగే యోగా కార్యక్రమానికి ప్రధాని మోదీ రానున్నారు. సాగర తీరంలో సుమారు 5 లక్షల మందితో యోగాసనాలు వేయించేందుకు చర్యలు చేపట్టారు. ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని తలపెట్టడంతో అధికారులందరూ ఆ కార్యక్రమంలో ఉంటారు. . ట్రాన్స్‌పోర్ట్ కూడా తక్కువ అందుబాటు-లో ఉంటు-ంది. అలాంటి సందర్భంలో పరీక్షలు పెడితే అభ్యర్థులు ఇబ్బంది పడతారని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. యోగా డే సందర్భంగా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను దృష్టిలో ఉంచుకుని వారి రాకపోకలకు అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో ఈ పరీక్షల తేదీలు మార్చినట్లు- తెలిపారు. ఈ అభ్యర్థులకు జులై 1, 2 తేదీల్లో పరీక్ష నిర్వహిస్తామని, దీనికి సంబంధించి పరీక్షా కేంద్రాలు, పరీక్ష తేదీలు మార్చిన హాల్ టిక్కెట్లు అందుబాటులో ఉంచుతామని కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. అభ్యర్థులు మార్చిన హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని దాని ప్రకారం పరీక్షలకు హాజరు కావాలని తెలిపారు.

# ఇజ్రాయెల్,ఇరాన్ పరస్పర దాడులతో ఉద్రిక్తత

టెహ్రాన్, ఇజ్రాయెల్,ఇరాన్ పరస్పర దాడులతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తత పెరుగుతోంది. ఇరాన్ క్షిపణి దాడుల క్రమంలో శనివారం ఇజ్రాయెల్ రక్షణ్ మంత్రి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఇజ్రాయెల్ పై క్షిపణి దాడులు ఆపకపోతే టెహ్రాన్ నగరాన్ని మొత్తం కాల్చి బూడిద చేస్తామని హెచ్చరించారు. జూన్ 13న ఇరాన్ అణు , సైనిక స్థావరాలు లక్ష్యంగా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సీనియర్ కమాండర్లు అణుశాస్త్రవేత్తలతో సహా 78 మంది మృతిచెందారు. ప్రతీకారంగా ఇరాన్.. ఇజ్రాయెల్ భూభాగంలో డ్రోన్లు, 150 బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించింది. జెరుసలేం, టెల్ అవీవ్, రిషాన్ లెజియాన్, రామత్ గాన్ లలో భారీ విధ్వంసం జరిగింది. ముగ్గురు ఇజ్రాయెలీలు చనిపోగా.. డజన్లకొద్ది పౌరులు గాయపడ్డారు. దాడులు, ప్రతీకార దాడులతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతను మరింత పెంచేలా కనిపిస్తోంది. ఇరాన్ పై ఇజ్రాయెల్ మరిన్ని దాడులు చేస్తామని హెచ్చరిస్తోంది. మరోవైపు ఇరాన్ క్షిపణి దాడులను అడ్డుకోవడంలో సాయం చేస్తే యూఎస్, యూకే , ఫ్రాన్స్ స్థావరాలు లక్ష్యంగా దాడులు చేస్తామని ఇరాన్ బెదిరించింది. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తత.. ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరిగితే ప్రాంతీయ సంఘర్షణకు దారి తీసే ప్రమాదం ఉన్నందున ఇజ్రాయెల్ కు యూఎస్ సైనిక మద్దతును పెంచింది. అమెరికన్ వైమానిక రక్షణ వ్యవస్థలు ఇరానియన్ క్షిపణులను అడ్డుకోవడంలో సాయ పడ్డాయని అమెరికన్ రక్షణ అధికారి చెప్పడం ప్రత్యక్షంగా అమెరికా జోక్యాన్ని ఇరాన్ తప్పుపడుతోంది. క్షిపణి దాడులను అడ్డుకుంటే అమెరికా సైనిక స్థావరాలపైకూడా దాడులు తప్పవని హెచ్చరించింది. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలను తగ్గించాలని పిలుపులు వస్తున్నప్పటికీ రెండు వైపులా వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేశారు. దీంతో రెండు దేశాలు మరింత సైనిక చర్యకు పాల్పడే అవకాశం గంట గంటకూ పెరుగుతోంది.

# మళ్లీ యాక్టివ్ అవుతారా?

విశాఖ: ఉమ్మడి విశాఖ రాజకీయాల్లో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హవా బానే నడిచింది. వారసత్వంతోరాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన తనకంటూ ఇమేజ్‌ని క్రియేట్ చేసుకున్నారాయన. మాట్లాడే ప్రతి మాట జనాల్లోకి నెగిటివ్‌గానో.. పాజిటివ్‌గానో జనం నోళ్లతో నానుతూనే ఉండేది. వైసీపీ ప్రభుత్వ హయాం లో తనకు అడ్డే లేకుండా చేసుకున్న ఆ మాజీ మంత్రి ప్రస్తుతం సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన గుడివాడ ప్రస్తుత ం విశాఖ వైసీపీ రాజకీయాల్లో ప్రాధాన్యత లేకుండా చేయడంతో దూరంగా ఉంటున్నారనే ప్రచారం జరుగుతుంది. ఇంతకీ గుడివాడ ఏందుకు సైలెంట్ అయ్యారు?

### చిన్న వయసులోనే మంత్రిగా పనిచేసిన గుడివాడ అమర్నాథ్

ఉమ్మడి విశాఖ జిల్లా రాజకీయాల్లో తనకంటూ ఇమేజ్ ని క్రియేట్ చేసుకున్న నాయకుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్.. చిన్న వయసులోనే మంత్రిగా పనిచేసిన ఆయన సభలు సమావేశాల్లో తన నోటి దూకుడుతో హైలెట్ అయ్యారు. ఆ దూకుడుతో మాజీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుల్లో ఒకరయ్యారు. రాజకీయాల్లో పాజిటివ్‌గా మాట్లాడినా నెగిటివ్‌గా మాట్లాడినా మనుగడలో ఉండడం అన్న అంశాన్ని వంట బట్టించుకుని జిల్లాలో రాజకీయం నడిపారు.

### గుడివాడ గురునాధరావు వారసుడిగా పొలిటికల్ ఎంట్రీ

రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నాటి నుండి గుడివాడ అమర్నాథ్ అదే ఫార్ములా ఫాలో అవుతూ వచ్చారు. మాజీ మంత్రి గుడివాడ గురునాధరావు వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన తొలి రోజుల్లో టీడీపీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచారు. తర్వాత వైసిపి తీర్థం పుచ్చుకుని అనకాపల్లి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో అనకాపల్లి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి చేపట్టి మీడియా ముందు తన మాటలతో ప్రతిపక్షాలకు విమర్శనాస్త్రాలు అందించారన్న అపవాదు మూటగట్టుకున్నారు. గుడ్డు మంత్రని నెటిజన్ల ట్రోలింగ్‌కు గురయ్యారు.

### గాజువాకలో 95 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడిపోయిన రికార్డు

2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి చెందడంతో అధికారం కోల్పోయింది. గుడివాడ అమర్‌నాథ్ ఆ ఎన్నికల్లో గాజువాక నుంచి పోటీ చేసి 95 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడిపోయిన రికార్డు సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత గుడివాడ అమర్నాథ్‌ను విభజిత విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమించింది వైసీపీ అధిష్టానం. వైసిపి నిర్ణయంతో గత సంవత్సర కాలంగా అనేక ఆందోళనలు నిర్వహించి, ప్రెస్ మీట్‌లు పెట్టి మరీ ప్రభుత్వంపై విమర్శలు చేసిన ఆయన ప్రస్తుతం సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోవడం చర్చనీయాశంగా మారింది.

### ఎన్నికల ముందు అనకాపల్లి ఇన్చార్జ్‌గా తప్పించిన జగన్

2024 ఎన్నికల ముందు అనకాపల్లి నియోజకవర్గం ఇన్చార్జిగా గుడివాడ అమర్నాథ్‌ను తొలగించి.. ఎన్నికలు వచ్చేవరకు ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారు అనేది చెప్పకుండా చివరిలో గాజువాక నియోజకవర్గం నుంచి బరిలోకి దింపారు. విశాఖ జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా నియమితులయ్యాక, గాజువాక నియోజకవర్గం విశాఖ జిల్లాలో ఉండడం, అమర్నాథ్‌కు సొంత ప్రాంతం కావడంతో వైసిపి అధికారంలో లేకపోయినా కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతూ వైసిపి అధిష్టానం నుండి వచ్చే సూచనలు పాటిస్తూ ముందుకు కొనసాగారు.

### చోడవరం వైసీపీ ఇన్చార్జ్‌గా పంపించిన జగన్

అంతవరకు బాగానే నడిచింది. సడన్‌గా జగన్ పార్టీ పటిష్టత పేరుతో అమర్నాథ్ ను గాజువాక నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జిగా తొలగించి అనకాపల్లి జిల్లాలోని

# పెరుగుతున్న విమాన ప్రమాదాలు.. ఈ ఐదే ప్రధాన కారణాలు




న్యూఢిల్లీ, విమాన ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఫ్లైట్ టేకాఫ్ అయిందంటే.. లాండింగ్ అయ్యే వరకు ఎన్నెన్నో గండాలు. వెదర్ కండీషన్స్ దాటాలి. ఇంజిన్ కండీషన్, హైడ్రాలిక్ ఆపరేషన్స్, క్యాబిన్ క్రూ ఎక్స్ పీరియన్స్ చాలా కీ రోల్ పోషిస్తాయి. ఫ్యూయెల్ ఎంత ఉంది.. రన్ వే పై ఏ లెవెల్‌లో గాల్లోకి టేకాఫ్ చేయాలి? ఇంజిన్లలో ప్రాబ్లమ్ వస్తే ఏం చేయాలి.. విమానాలను సర్వీసింగ్ చేయించడం ఇవన్నీ కీలకమే. డిమాండ్‌ను బట్టి టిక్కెట్ రేట్లు బాదేస్తున్న విమానయాన సంస్థలు.. మరి ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడడం కరెక్టేనా అన్న చర్చ జరుగుతోంది.

### స్పైస్ జెట్ లెఫ్ట్ ఇంజిన్‌లో మంటలు

ఈ ఘటన 2022 జూన్ 19న పాట్నా ఎయిర్ పోర్ట్ సమీపంలో జరిగింది. పాట్నా నుంచి ఢిల్లీకి స్పైస్ జెట్ బోయింగ్ 737 విమానం టేకాఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే.. బర్డ్ హిట్ అవడం వల్ల ఎడమ ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. అయినప్పటికీ, పైలట్ కెప్టెన్ మోనికా ఖన్నా నైపుణ్యంతో విమానాన్ని సేఫ్‌గా పాట్నా ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ చేశారు. హెవీ ఫ్యూయల్ ఉన్నా.. ఎఫెక్టెడ్ ఇంజిన్‌ను షట్ డౌన్ చేసి, సింగిల్ ఇంజిన్ తోనే లాండ్ చేశారు. అయితే ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే పాట్నా ఎయిర్‌పోర్ట్‌లో షార్ట్ రన్‌వే ఉంది.

### పైలెట్‌కు 18 నిమిషాల సమయం

క్రిటికల్ ఎయిర్‌ఫీల్డ్ ఇది. అయినా పైలెట్ చాకచక్యంతో ల్యాండింగ్ చేశారు. 185 ప్యాసింజర్స్, 6 క్రూ మెంబర్స్ ను సేఫ్‌గా డీబోర్డ్ చేశారు. సో ఇక్కడ జరిగిందేంటంటే.. పాట్నా విమానం 12 గంటల 4 నిమిషాలకు టేకాఫ్ అయితే.. 12 గంటల 22 నిమిషాలకు ల్యాండింగ్ చేశారు. అంటే పైలెట్‌కు కొంత టైమ్ దొరికింది. కానీ అహ్మదాబాద్‌లో కేవలం 30 సెకెన్ల వ్యవధిలోనే క్రాష్ జరిగిపోయింది.

### 90 డిగ్రీల యాంగిల్ లో క్రాష్ లాండ్

ఇప్పుడు మరో ఎగ్జాంపుల్ చూద్దాం.. నిట్టనిలువుగా 90 డిగ్రీల యాంగిల్ లో కిందికి వస్తున్న ఈ ఫ్లైట్ ఎందుకిలా వచ్చిందో తెలియదు. హై ఆల్టిట్యూడ్ నుంచి నిటారుగా కిందపడడంతో ఒక్కరు కూడా మిగలలేదు. విమాన శకలాలు కూడా ముక్కలు ముక్కలయ్యాయి. ఈ డేంజర్ క్రాష్ చైనాలో 2022 మార్చి 21న జరిగింది. అసలు ఏదైనా ఫ్లైట్ ఇలా అస్సలు జర్నీ చేయదు. హారిజాంటల్ స్టెబిలైజర్ ఉంటుంది. కానీ ఘటన జరిగిపోయింది. కేవలం ఒకే ఒక్క నిమిషంలో 20 వేల అడుగులకు పైగా ఆల్టిట్యూడ్ డౌన్ అయింది. అది కూడా 90 డిగ్రీస్ యాంగిల్ లో. ఎందుకు జరిగిందన్నది ఇప్పటికీ మిస్టరీనే. ఫోర్స్ ఫుల్ గా క్రాష్ అవడంతో భూమి లోపల 66 అడుగుల లోతైన గుంత ఏర్పడిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

### 1.25 లక్షల లీటర్ల ఇంధనంతో టేకాఫ్

కారణాలేవైనా విమాన ప్రమాదాలు ఇటీవలి కాలంలో చాలా ఎక్కువగా జరుగుతున్నాయి. లేటెస్ట్ గా అహ్మదాబాద్ ఘటన. విమానంలో ఉన్న వారే కాదు.. మెడికల్ కాలేజ్ హాస్టల్ పై కూలడంతో అందులో ఉన్న వారు కూడా చనిపోయిన పరిస్థితి. 1.25 లక్షల లీటర్ల ఇంధనంతో టేకాఫ్ అయిన ఈ విమానం.. క్రాష్ అవడం, ఒక్కసారిగా బ్లాస్ట్ అవడంతో వెయ్యి డిగ్రీల సెంటీగ్రేడ్ వేడి క్రియేట్ అయింది. ఇంతటి వేడికి ఏదైనా ఐరన్ డోమ్ అడ్డొస్తే తప్ప బతికి బట్టకట్టే పరిస్థితి ఉండదు. ఒకే ఒక్క వ్యక్తి మృత్యుంజయుడిగా ప్రాణాలతో బయటపడ్డారు. సో ఈ ప్రమాదాల నుంచి పాఠాలు నేర్వాల్సిందే అన్న డిమాండ్లు పెరుగుతున్నాయి. నిజానికి రోడ్డుపై ఏదైనా వెహికిల్ ఇంజిన్ లో లోపం తలెత్తితే పక్కకు ఆపే ఛాన్స్ ఉంటుంది. ట్రైన్ అయినా ట్రాక్ పై ఆగుతుంది. విమానం అలా కాదు. గాల్లోనే ప్రాణాలు. ఏదైనా జరిగితే పై ప్రాణాలు పైనే పోతాయి. అంతటి రిస్కీ జర్నీ అది. ఇలాంటి లేటెస్ట్ యుగంలో టెక్నికల్ ఫాల్ట్స్, హ్యూమన్ ఎర్రర్స్ ను తగ్గించాల్సిన్నది మెయిన్ పాయింట్.

### ప్రమాదాలకు పైలట్ మిస్టేక్స్ 50% కారణం

నిజానికి హ్యూమన్ ఎర్రర్ అంటే పైలట్ మిస్టేక్స్ ప్రమాదాలకు 50 శాతం కారణం అని.. ఏవియేషన్ సేఫ్టీ నెట్ వర్క్ చెబుతున్న మాట. సో టెన్షన్ లో ఏం చేయాలో ఒక్కోసారి అర్థం కాదు. అయితే అలాంటప్పుడే పైలెట్ చాకచక్యంగా ఆలోచిస్తే ప్రమాదం నుంచి బయటపడొచ్చు. అహ్మదాబాద్ ఘటనలో పైలట్‌కు 30 సెకెన్లు మాత్రమే ఛాన్స్ దొరికింది. అసలు హై ఆల్టిట్యూడ్‌కు వెళ్లనేలేదు. ఎందుకు వెళ్లలేదన్నదే ఇప్పుడు బిగ్ క్వశ్చన్. ఇది ఎగ్జామిన్ చేయాల్సి ఉంది. ఫ్లైట్ టేకాఫ్ అయిన వెంటనే.. తగినంత ఎత్తుకు చేరకపోవడం వెనుక రకరకాల పారామీటర్స్ కారణం.

### రెండు ఇంజిన్లు ఒకేసారి పని చేయలేదా?

ఫ్లైట్ మేనేజ్‌మెంట్ కంప్యూటర్‌లో తప్పుగా ప్రోగ్రామింగ్ చేయడం లేదా.. లిఫ్ట్ కోసం ఇంధన బరువును తప్పుగా లెక్కించడం వంటి లోపాలు.. ఫ్లైట్ ఆల్టిట్యూడ్ పెరగకపోవడానికి కారణం కావొచ్చు. ఎయిరిండియా విమానంలో అదే జరిగింది. పైలట్స్ %ూుజ%కి మేడే కాల్ చేశారు. అంటే టెక్నికల్ ఫాల్ట్ వచ్చిందని ఎమర్జెన్సీ బటన్ నొక్కారు. ఈ ప్రకారం చూస్తే రన్ వే మొత్తం వాడుకుని టేకాఫ్ అయినా ఎత్తు చేరుకోవడంలో అకస్మాత్తుగా సమస్య రావడం, రెండు ఇంజిన్లు ఒకేసారి పని చేయకుండా పోయాయా అన్నది ఇప్పుడు దర్యాప్తులో తేలనుంది. నిజానికి 1.25 లక్షల లీటర్లను సింగిల్ ఇంజిన్ భరించే కెపాసిటీ కూడా తక్కువే.

### విమాన కంపెనీలను బట్టి పైలెట్లకు ట్రైనింగ్

ఎమర్జెన్సీ సిచ్యుయేషన్స్ అంటే ఇంజన్ ఫెయిల్యూర్, టర్బులెన్స్ హ్యాండిల్ చేయడానికి పైలట్స్‌కు ట్రైనింగ్ ఇస్తారు. విమానానికి రెండు ఇంజిన్లు ఉంటాయి. ఒకటి పని చేయడం ఆగినా రెండోదాంతో సేఫ్ లాండింగ్‌కు వాడొచ్చు. కాక్‌పిట్‌లో టీమ్‌వర్క్, కమ్యూనికేషన్ ఇంప్రూవ్ చేయడం కూడా కీలకమే. ప్రతి ఎయిర్‌క్రాఫ్ట్ మోడల్ ను బట్టి అంటే బోయింగ్ 737, ఎయిర్ బస్ 320 వేర్వేరు ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ఉంటాయి. కాబట్టి వాటి కోసం పైలెట్లకు స్పెసిఫిక్ ట్రైనింగ్ అవసరం. ప్రతి 6 నుంచి 12 నెలలకు పైలట్స్ రీ సర్టిఫికేషన్ చేస్తారు. వారి ఫిజికల్, మెంటల్ హెల్త్ చెక్ చేయాలి. మరి మన దగ్గర అది పకడ్బందీగా జరుగుతుందా అన్నది కీలకంగా మారింది.

### 400 - 600 గంటల జర్నీ తర్వాత ఫ్లైట్ కు Aచెక్

టెక్నికల్ ఫెయిల్యూర్స్ విమాన ప్రమాదాలకు ప్రధాన కారణం. రెగ్యులర్ సర్వీసింగ్ తో దీనికి చెక్ పెట్టొచ్చు. అహ్మదాబాద్‌లో ప్రమాదానికి కారణమైన ఎయిరిండియా ఫ్లైట్ జూన్ 12న ఢిల్లీ నుంచి అహ్మదాబాద్ వచ్చింది. అలా వచ్చేటప్పుడే అందులో ఏసీ సరిగా పని చేయలేదన్న కంప్లైంట్ ప్రయాణికుల నుంచి వచ్చింది. కాబట్టి అహ్మదాబాద్ లో మరో ప్రాబ్లమ్ యాడ్ అయి 265 ప్రాణాలను బలి తీసుకున్నట్లయింది. ప్రతి ఫ్లైట్ జర్నీకి ముందు ఎక్స్‌టీరియర్, ఇంజన్స్, టైర్స్ చెక్ చేస్తారు. ఓవరాల్‌గా A, C, D అని మూడు రకాల చెకింగ్స్ చేయాలి. 400 నుంచి 600 గంటల జర్నీ తర్వాత ఫ్లైట్ కు A Check చేస్తారు. అలాగే 18 నుంచి 24 నెలల మధ్య Cచెక్ చేస్తారు. ఐదారేళ్లకు D చెక్ చేస్తారు.

### మైనర్ రిపేర్స్, లుబ్రికేషన్, ఫ్లూయిడ్స్ రీప్లేస్‌మెంట్

24 నుంచి 48 గంటల మధ్య డైలీ చెక్ చేయడం కంపల్సరీ. డీటెయిల్డ్ ఇంజన్స్ ఇన్ స్పెక్షన్, ల్యాండింగ్ గేర్, హైడ్రాలిక్ సిస్టమ్స్ చూస్తారు. 1 నుంచి 2 గంటల్లో ఈ చెకింగ్ పూర్తవుతుంది. %ూ% చెక్ లో ఇంజన్స్, ల్యాండింగ్ గేర్, ఫ్లైట్ కంట్రోల్ సిస్టమ్స్ డీప్ ఇన్స్పెక్షన్ చేస్తారు. మైనర్ రిపేర్స్, లుబ్రికేషన్, ఫ్లూయిడ్స్ రీప్లేస్‌మెంట్ చేస్తారు. దీనికి 1 నుంచి 2 రోజులు టైం పడుతుంది. %జ% చెక్ లో 6 వేల ఫ్లైట్ హవర్స్ తర్వాత విమానం స్ట్రక్చరల్ ఇన్స్పెక్షన్, క్యాబిన్ ఇంటీరియర్ రిఫర్బిష్‌మెంట్, సీట్స్, కార్పెట్ రీప్లేస్‌మెంట్, మేజర్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ చెక్స్ చేస్తారు. దీనికి ఒకటి నుంచి రెండు వారాల టైం పడుతుంది. ఇక ఐదారేళ్లకు ఓసారి చేసే D చెక్.. లో రీ-బిల్డింగ్, మేజర్ కాంపోనెంట్స్ రీప్లేస్‌మెంట్స్ చేస్తారు.

### విమానయాన సంస్థలు ఈ చెకింగ్స్ నిజంగానే చేస్తున్నాయా?

ఇందుకు 1 నుంచి రెండు నెలల టైం పడుతుంది. ఇవన్నీ ప్రతి కమర్షియల్ ఫ్లైట్ కు రెగ్యులర్ గా చేయించాల్సిన సర్వీసింగ్ ప్రొసీజర్. మరి ఇవన్నీ విమానయాన సంస్థలు నిజంగానే చేస్తున్నారా.. లేదంటే మమ అనిపించి గాల్లోకి వదులుతున్నారా అన్నది ఇప్పుడు తేలాల్సిన విషయం. ఇప్పుడు అహ్మదాబాద్‌లో ఎయిరిండియా క్రాష్ అవడంతో.. ఫ్లైట్స్ చెకింగ్ విషయంలో డీజీసీఏ ఎలాంటి ఆర్డర్స్ ఇస్తుందన్నది కీలకంగా మారుతోంది.

### కుంభమేళా టైంలో బాదేసిన విమాన సంస్థలు

విమానయాన సంస్థలు సప్లై అండ్ డిమాండ్ మెథడ్‌లో.. టిక్కెట్ రేట్లను మేనేజ్ చేసుకుంటున్నాయి. ఎప్పుడో ఒకప్పుడు ఆఫ్ సీజన్‌లో ఆఫర్లు.. మిగితా సీజన్లలో బాదుడే బాదుడు స్టైల్ పెంచేశాయి. ఇటీవలి కుంభమేళానే చూడండి.. దేశంలో ఎక్కడి నుంచి ప్రయాగ్ రాజ్ వెళ్లినా సరే టిక్కెట్ రేట్లు ఆకాశాన్నంటాయి. కంట్రోల్ చేసిన వారే లేరు. అయినా సరే టైమ్ కలిసి వస్తుందనుకున్న వారు లక్షలు పెట్టి టిక్కెట్ కొని ఫ్లైట్ జర్నీ చేశారు. ఈ ఏడాది జనవరి 31న ప్రయాగ్ రాజ్‌కు హైదరాబాద్ నుంచి అక్షరాలా వన్‌వే ఫ్లైట్ టిక్కెట్ ఒక లక్షా 2 వేలుగా నమోదైంది. డీజీసీఏ జోక్యం చేసుకున్నప్పటికీ ముఖ్యమైన కుంభమేళా తేదీలు ముగిసిన తర్వాత టిక్కెట్ రేట్లు తగ్గాయి. అదీ పరిస్థితి. సరే ఏ బిజినెస్ మోడల్ అయినా డిమాండ్ ఉన్నప్పుడే లాభాలే చూసుకుంటాయి కదా అనుకుందాం.. మరి అహ్మదాబాద్ లాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రాణాలు పోతే ఎవరిది భరోసా?

### రెవెన్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ తో టిక్కెట్ రేట్లు

విమానయాన సంస్థలు టిక్కెట్ రేట్లను నిర్ణయించడానికి.. రెవెన్యూ మేనేజ్‌మెంట్ అనే సాఫిస్టికేటెడ్ సిస్టమ్‌ను ఉపయోగిస్తాయి. ఇది డిమాండ్, సీట్ అవైలబిలిటీ, మార్కెట్ కండిషన్స్, ఇతర ఫ్యాక్టర్స్ ఆధారంగా ధరలను డైనమిక్‌గా అడ్జస్ట్ చేస్తుంది. ఈ ప్రాసెస్‌లో AI అల్గారిథమ్స్, హిస్టారికల్ డేటా, రియల్-టైమ్ అనాలిసిస్ వాడుతారు. సో సప్లై అండ్ డిమాండ్ టైంలో అంటే సంక్రాంతి, దీపావళి, క్రిస్మస్, సమ్మర్ వెకేషన్స్ వంటి పీక్ సీజన్స్‌లో, అదే సమయంలో పాపులర్ రూట్స్‌లో ఫ్లైట్ టిక్కెట్ ఎక్కువ రేట్లు ఉంటాయి. ఒక ఫ్లైట్‌లో సీట్లు తగ్గిపోతున్నప్పుడు, ఏ రేంజ్ అయినా సరే రెవెన్యూ మేనేజ్‌మెంట్ అల్గారిథమ్ ఆటోమాటిక్‌గా ధరలను పెంచుతుంది.

### టిక్కెట్ రేట్లపై ఉన్న శ్రద్ధ, ప్రయాణికుల భద్రతపై ఉంటోందా?

కొన్ని ఎయిర్‌లైన్స్ అయితే.. టిక్కెట్ బేస్ ఫేర్‌ను తక్కువగా చూపించి, ఎక్స్‌ట్రా సర్వీసెస్ కు ఫీజ్ వసూలు చేస్తాయి. సీట్స్ లభ్యత, కాంపిటీటర్ ఫేర్స్, బుకింగ్ స్పీడ్ ఆధారంగా AI అల్గారిథమ్స్ ధరలను అప్‌డేట్ చేస్తాయి. భారత్ లో ఎయిర్‌లైన్స్‌ను మానిటర్ చేస్తుంది. 2010 నిబంధన ప్రకారం, ఎయిర్‌లైన్స్ 24 గంటల్లో టిక్కెట్ రేట్లు మార్చుకునే వెసులుబాటు ఉంది. అంటే డిమాండ్ దే ఉంటే ముందే రేట్ సెట్ చేసి పెట్టుకుంటాయి. అవసరమైతే అప్పటికప్పుడు మార్చేస్తాయన్న మాట. సో టిక్కెట్ రేట్లపై ఉన్న శ్రద్ధ, విమానం మెయింటెనెన్స్, ప్రయాణికుల భద్రతపై ఉంటోందా అన్న ప్రశ్నలైతే వస్తున్నాయి.

# మీనాక్షిమిస్టేక్ ? హస్తం నేతల గుస్సా!



హైదరాబాద్, తెలంగాణ కాంగ్రెస్లో పదవుల పండుగ ఒకవైపు అలకలు మరోవైపు కొనసాగుతున్నాయి. అవి పార్టీ లో సహజమే కానీ ఆ రుసరుసలు, అసంతృప్తి పీసీసీ చీఫ్, సీఎంలపై అంటే లైట్ తీసుకునే వారేమో.. కానీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుండటం చర్చనీయాంశంగా మారింది. మేడమ్ రాష్ట్రానికి వచ్చే ముందు ఒక స్టాండ్ తీసుకుంటే తగ్గేదేలే అన్నట్లు ఉంటారని, ఎవరి ఒత్తిళ్లకు లొంగరని, సింప్లిసిటీ, లాయల్టీలకి మారుపేరని ప్రచారం జరిగింది. కానీ పీసీసీ కార్యవర్గం లిస్ట్ రిలీజ్ తర్వాత మేడమ్‌పై ఇంప్రెషన్ పోయిందని నేతలు రుసరుసలాడుతున్నారు. ఇంతకీ మేడం చేసిన మిస్టేక్ ఏంటి? నేతలు ఎందుకు అందుకు అంత అసంతృప్తితో ఉన్నారు?

మీనాక్షి వచ్చినప్పుడు హ్యాపీగా ఫీలైన కాంగ్రెస్ శ్రేణులు

ఇక తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కి డోకా లేదు.. మీనాక్షి నటరాజన్ లాంటి మేడం ఏఐసీసీ ఇన్చార్జ్‌గా వస్తున్నారంటే పార్టీలో అందరికీ ఖచ్చితంగా న్యాయం జరుగతుందని అందరు భావించారు .. మొదట్లో మేడం ట్రైన్‌లో రావడం, ఆటోలో తిరగడం, ఫ్లెక్సీ లు పెట్టవద్దని చెప్పడం, పెద్ద హోటల్ లో కాకుండా గెస్ట్ హౌస్‌లో ఉండడంతో పార్టీ శ్రేణులన్నీ ఆమెపై తెగ ఇంప్రెషన్ పెంచేసుకున్నాయి. లీడర్ అంటే అలా ఉండాలని మాట్లాడుకున్నాయి. ఇక ఖచ్చితంగా పార్టీ లో కష్టపడ్డ వారికీ పదవులు వస్తాయని భావించారు.

విజయశాంతికి ఎమ్మెల్సీ పదవి దక్కడంతో షాక్

అక్కడి వరకు బానే ఉన్నా దాదాపు అన్ని పార్టీలు తిరిగివచ్చిన సినీ నటి విజయశాంతికి ఎమ్మెల్సీ పదవి దక్కడం అందరికీ షాక్ ఇచ్చింది. హీరోయిన్‌గా రిటైర్ అయ్యాక విజయశాంతి తల్లి తెలంగాణ పార్టీ పెట్టుకుని పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. దాన్ని టీఆర్ఎస్‌లో విలీనం చేసి తొలిసారి ఎంపీగా గెలిచారు. తర్వాత కేసీఆర్ ఆమెకు మెదక్ టికెట్ నిరాకరించడంతో కాంగ్రెస్‌లో చేరారు. అక్కడ నుంచి బీజేపీలో చేరి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. సినిమాల్లో సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన రాములమ్మ కాంగ్రెస్ పార్టీలో కూడా పూర్తిస్థాయిలో యాక్టివ్‌గా లేరు. అలాంటి విజయశాంతికి ఎమ్మెల్సీ పదవి ఎలా వచ్చింది? ఆమె విషయంలో మీనాక్షి మేడమ్ ఏం స్టడీ చేసి రికమెండ్ చేశారు? అని పార్టీలో పెద్ద చర్చే జరిగింది. అయితే కొందరు మేడమ్‌ను అడిగితే.. ఎలక్షన్ కంటే ముందు వచ్చారు కదా? అందుకే పదవి వచ్చిందని చెప్పారంట.

సెక్రటేరియట్‌లో సమావేశాల ఏర్పాటుపై ఆశ్చర్యం

ఇక మీనాక్షి నటరాజన్ ప్రభుత్వం విషయంలో జోక్యం చేసుకోరని అందరు అనుకున్నారు. కానీ అందరి ఊహలను తలకిందులు చేశారు ఇన్‌ఛార్జ్ .. కంచె గచ్చిబౌలి భూ వివాదం విషయంలో సర్కార్ ఒక నిర్ణయం తీసుకుంది. దానిపై ఒకింత వ్యతిరేకత వ్యక్తమైంది. వెంటనే మీనాక్షి నటరాజన్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులతో, ప్రజా సంఘాలతో చర్చలు జరిపారు. ఏకంగా సెక్రటేరియట్‌లో సమావేశాలు ఏర్పాటు చేశారు. అది కాంగ్రెస్ నేతలకు మరో షాక్ ఇచ్చింది. ఇదేంటి పార్టీ ఇన్చార్జ్ సెక్రటేరియట్‌లో మీటింగ్స్ పెట్టడం ఏంటి?, ప్రభుత్వ నిర్ణయాల్లో ఇన్వాల్వ్ అవ్వడం ఏంటని అందరూ ఆశ్చర్చపోవాల్సి వచ్చింది.

సమీక్షా సమావేశాల్లో నేతల వివరాల సేకరణ

లేటెస్ట్‌గా చూస్తే.. పార్టీ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ పార్లమెంట్ సెగ్మెంట్ల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల ముఖ్య నేతలు, పార్టీ లో యాక్టివ్‌గా ఉండేవారికి కుడా సమయం ఇచ్చి మాట్లాడుతున్నారు. ఎవరి సమస్యలు ఏంటని తెలుసుకుంటూ.. ఎవరికిఏ పదవి కావాలో? ఎప్పటి నుండి పార్టీ లో ఉన్నారో అన్ని వివరాలు సేకరిస్తున్నారు. అది చాలా మంచి పరిణామమని అందరూ సంతోషపడ్డారు. ఐతే ఇటీవలే పీసీసీ కార్యవర్గం లిస్టు రిలీజ్ అయ్యాక అందరూ మళ్లీ షాక్ అయ్యారంట. 27 మంది వైస్ ప్రెసిడెంట్‌లు, 69 మంది జనరల్ సెక్రటరీలతో విడుదలైన పీసీసీ కార్యవర్గం జాబితాపై పార్టీ సీనియర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారంట.

అధికారంలోకి వచ్చాక ఎంట్రీ ఇచ్చిన వారికి పదవులు

పీసీసీ పదవులులో 10కి పైగా అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు పార్టీ వదిలేసి, పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి వచ్చిన వారికి అవకాశం ఇచ్చిన్నట్లు గాంధీభవన్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మీనాక్షి నటరాజన్ 2017 నుండి పార్టీలో ఉన్నవారికే పదవులు అన్నారు. తర్వాత ఎన్నికల కంటే ముందు పార్టీలోకి వచ్చిన వారికి కూడా ప్రాధాన్యత అన్నారు. మరి పార్టీ పవర్‌లోకి వచ్చాక రీఎంట్రీ ఇచ్చిన వారికి ఎలా పదవులు కట్టబెట్టారని కాంగ్రెస్ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. ఆమె కమిట్‌మెంట్‌పై ఎంతో నమ్మకం పెట్టుకుంటే ఇలా చేశారేంటని అసహనం వ్యక్తం చేస్తున్నాయి.

కరోనా సమయంలో సేవలందించిన కాంగ్రెస్ కార్యకర్తలు

అదలా ఉంటే కరోనా సమయంలో ఎక్కడి వారు అక్కడ ఇళ్లల్లో ఉంటే ఒక 12మంది కాంగ్రెస్ కార్యకర్తలు రోజు గాంధీభవన్‌కి సేవలు అందించారు. కాల్స్ రిసీవ్ చేసుకుంటూ సమస్యలో ఉన్నవారికి అందుబాటులోకి వెళ్ళి పని చేశారు. ఆ పన్నెండు మందిలో ప్రేమ్‌లాల్ అనే కార్యకర్తచనిపోయారు. నాగేష్ ముదిరాజ్ పార్టీలో లేరు. ఇక మిగిలిన 10 మందికి ఇంతకు ముందున్న ఇన్‌ఛార్జ్ దీపాదాస్‌మున్షీ భవిష్యత్తులో మంచి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారంట. అలాగే పీసీసీ కార్యవర్గం లిస్టులో కూడా పేర్లు పెటిన్నట్లు వార్తలు ఉన్నాయి. అయితే ఆ 10 మందిలో ఒక్కరికి కూడా పీసీసీ కార్యవర్గంలో అవకాశం ఇవ్వలేదంట.

అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సామాజికవర్గం నేతలు

మరోవైపు యాదవ సామాజికవర్గం నేతలు కూడా కాంగ్రెస్ కమిటీలపై ఆసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికే పదవులు ఇవ్వడంపై సీనియర్లు అసంతృప్తిగా ఉన్నారు. బీసీలలో రాజకీయంగా, సామాజికంగా బలంగా ఉన్న యాదవ సామాజిక వర్గ నేతలు తమకు ప్రాధాన్యత దక్కలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యవర్గంలో అతి కీలకమైన పీసీసీ ఉపాధ్యక్ష పదవుల్లో తమకు ప్రాతినిధ్యం లేకపోవడంపై సదరు ఆశావహులు అలిగారంట. అలాగే 69 మంది జనరల్ సెక్రటరీలో కేవలం ఒక్కటే స్థానం కేటాయించడంపై యాదవ నేతల తీవ్ర అసంతృప్తితో ఉన్నారంట.

మున్నూరు కాపులకు 7, గౌడ సామాజిక వర్గానికి 8 స్థానాలు

సామాజిక న్యాయం అంటూ మున్నూరు కాపులకు 7 , గౌడ సామాజిక వర్గానికి 8 స్థానాలను కేటాయించి మిగిలిన సామాజిక వర్గాలని విస్మరించారని గాంధీభవన్‌లో తెగ చర్చలు నడుస్తున్నాయి. మొత్తానికి ఎవరికి వారు ఏఐసీసీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్‌పై తీవ్ర అసంతృప్తితో ఉన్నారంట. హైకమాండ్ దూతలుగా ఎవరు వచ్చినా కష్టపడిన వారికి పదవులు రావని చర్చించుకుంటు న్నారు. మరి వారి అసంతృప్తి పై మీనాక్షినటరాజన్ ఎలా స్పందిస్తారో చూడాలి.

# సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియ షురూ..?




విశాఖ: ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియ జరుగుతుంది. అందులో భాగంగా నియమితులైన సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ శనివారం పదవి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన వాల్తేర్ డివిజనల్ మేనేజర్ తో పాటు రైల్వే అధికారులతో సమీక్ష నిర్వహించారు. జోన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేసే అంశాలను చర్చించారు.

మరోవైపు విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేసిన రైల్వే జోన్ లో వాల్తేర్ డివిజన్ కొనసాగించాలని ఇప్పటికే నిర్ణయించారు. అయితే కొత్తగా ఏర్పాటు చేసిన రాయగడ డివిజన్లో పూర్తిగా ఒడిస్సా ప్రాంతం కలుపుతూ డివిజన్ పరిధిలో నిర్ణయించారు. కానీ వాల్తేర్ డివిజన్ కు సంబంధించిన కొన్ని ప్రాంతాలు మాత్రం ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోకి వెళ్లాయి. ఆరోగ్యంగా పలాస ఇచ్ఛాపురం... ఇటు కొత్తవలస నుంచి అరకు ప్రాంతం ఇతర డివిజనల్ లో ఉన్నాయి ఈ దశలో అరకు తో పాటు ఇచ్ఛాపురం వరకు ఉన్న రైల్వే ప్రాంతాన్ని విశాఖపట్టణం డివిజన్లో ఉంచుతూ సాంకేతికపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఈ ప్రాంతానికి చెందిన ఎంపీ రామ్మోహన్ నాయుడు అరకు ఎంపీ డాక్టర్ తనుజా రాణి ఈ విషయంపై ఇప్పటికే కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తున్నారు రైల్వే అధికారులకు కూడా లేఖలు రాయడం జరిగింది. ఈ దశలో కొత్తగా పదవి బాధ్యతలు చేపట్టిన జనరల్ మేనేజర్ త్వరలోనే రైల్వే బోర్డు అధికారుల నిర్ణయం మేరకు పరిధులు మార్చే అవకాశం ఉంది. ఈ మేరకు డి పి ఆర్ ను సవరించాలని కూడా అధికారులు భావిస్తున్నారు. ఇలా ఉండగా ఏపీ విభజన సమయంలో విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఇస్తామని ప్రకటించినప్పటికీ పూర్తిస్థాయి ప్రక్రియ మాత్రం ఇప్పుడే మొదలైంది. ఈ దశలో ఆంధ్ర ప్రాంతంతో కూడిన రైల్వే స్టేషన్లు విశాఖ డివిజన్లో ఉండే రీతిన పరిధులు మార్చాలని అధికారులు చేస్తున్నట్టు తెలుస్తోంది.

# అణు ముప్పు సాకు మాత్రమే..అసలు టార్గెట్ ఇరాన్ ప్రభుత్వం కూల్చివేతే..



టెహ్రాన్:ఇరాన్ పై ఇజ్రాయెల్ దాడులు మీద దాడులు చేస్తోంది. దీనికి కారణం అణు ముప్పే అని చెబుతోంది. కానీ అసలు టార్గెట్ మాత్రం ఖమేనీ ప్రభుత్వాన్ని కూల్చేయడమే అని విశ్లేషకులు చెబుతున్నారు. అణు కార్యక్రమం సాకుతో ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడులను ముమ్మరం చేసింది. ఇరాన్ అణ్వాయుధాలను నాశనం చేస్తామని ప్రతిజ్ఞ చేసింది. అన్నట్టుగానే అణు కేంద్రాలపై దాడులు చేసింది. ఇందులో ఆ కేంద్రాలు దెబ్బ తిన్నాయని ఫోటోలు కూడా చూపెడుతోం ది. ఈ దాడుల్లో ఇద్దరు అణు శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులు కూడా చనిపోయారు. అయితే ఇజ్రాయెల్ దాడుల వెనుక కేవలం అణు ముప్పు మాత్రమే కాదని తెలుస్తోంది. ఆ దేశం దానికన్నా పెద్ద స్కెచ్చే వేసిందని చెబుతున్నారు.

ఇరాన్ ప్రభుత్వమే టార్గెట్..

అణు ముప్పు కేవలం సాకు మాత్రమేనని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అసలు ఉద్దేశం వేరని చెబుతున్నారు. ఇరాన్ లో ఖమేనీ ప్రభుత్వాన్ని కూల్చడమే ఆయన లక్ష్యమని అంటున్నారు. ఇరాన్ ప్రజలను నియంతృత్వం నుంచి విముక్తి పొందాలని నెతన్యాహు విజ్ఞప్తి చేశారు, దాని వెనుక కారణం ఇదేనని తెలుస్తోంది. ఇరాన్ ప్రజలు తమ జెండా, చారిత్రక వారసత్వం కోసం నిలబడి ఖమేనీ దుష్ట పాలనను అంతం చేయాల్సిన అవసరం సమయం ఆసన్నమైందని నెతన్యాహు అన్నారు. ఇరాన్ లో దాడులు జరిగాక ఆయన మాట్లాడుతూ...ఇది ప్రారంభం మాత్రమే ముందు ముందు ఇంకా చాలా ఎక్కువ ఉంటుందని అన్నారు. మరింత మంది నాయకులను మట్టుబెట్టడమే లక్ష్యమని చెప్పారు. అయితే మరోవైపు ఇరాన్ లో అధికారం మారితే దేశం అరాచకంలో కూరుకుపోతుందని చెబుతున్నారు. 9 కోట్ మంది జనాభా ప్రభావితం అవుతారని...దాని వలన మిడిల్ ఈస్ట్ అంతా అల్లకల్లోలం అయిపోతుందనే వాదన వినిపిస్తోంది. ఇక్కడ షా కుమారుడు రెజా పహ్లవి , ముజాహిదీన్-ఎ-ఖల్క్’ అంటే MEK లు కాచుకుని కూర్చొన్నాయి. వీరందరూ పాత రాచరికాన్ని తీసుకురావాలనే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు ఖమేనీ ప్రభుత్వం కనుక కూలిపోతే వారందరూ రెచ్చిపోతారని అంటున్నారు.

# కూటమి ఏడాది పాలన.. సర్వేలో సంచలన అంశాలు

అమరావతి, ఇటీవలే కూటమి ఏడాది పాలన పూర్తి చేసుకుంది. గత ఏడాది జూన్ 4న ఫలితాలు వచ్చాయి. అదే నెల 12న ప్రభుత్వం కొలువుదీరింది. సాధారణంగా ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో పాలనలో ఉన్న ఇబ్బందులను అధిగమించడానికి కొంత సమయం పడుతుంది. కానీ చంద్రబాబు రూపంలో సీనియర్ నేత ఉండడంతో.. తక్కువ రోజుల్లోనే పాలన గాడిలో పడింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత.. ఏడాది పాలనపై మిశ్రమ స్పందన వస్తోంది. ఇటీవల ప్రభుత్వం ఐవిఆర్ఎస్, సి ఎస్ డి ఎస్ పద్ధతిలో చేయించుకున్న సర్వేలో ఆసక్తికర ఫలితాలు వచ్చాయి. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు అవినీతి నియంత్రణపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించడం సంచలనం రేపుతోంది. అవినీతిని సహించేది లేదని హెచ్చరించడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది.

అవినీతిపై మాత్రం అసంతృప్తి..

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్టీఆర్ భరోసాపింఛన్లు పెంచి అందించిన విషయం విధితమే. అన్న క్యాంటీన్ల సేవలు ప్రారంభం, ఆసుపత్రుల్లో సేవలు మెరుగు, విద్యావ్యవస్థలో మార్పులు, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పనితీరుపై మాత్రం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే కొన్ని అంశాల్లో మరింత మెరుగుదల అవసరమని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. కానీ మొత్తం ప్రభుత్వంతో పాటు ప్రభుత్వ పెద్దల పనితీరుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. కానీ అవినీతి విషయంలో మాత్రం అసంతృప్తితో ఉన్నారు.గత ప్రభుత్వం మాదిరిగా అవినీతి కొనసాగుతోందని ఎక్కువ మంది చెప్పడం విశేషం. పింఛన్ల పంపిణీలు అవినీతి లేదంటూ 85 శాతం మంది చెప్తే.. పింఛన్లు ఇంటి వద్దే ఇస్తుండడంపై 87.8 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగుల ప్రవర్తన కూడా బాగుందంటూ 83.9 శాతం మంది తమ అభిప్రాయాలను చెప్పినట్లు తెలుస్తోంది. ప్రధానంగా అన్నా క్యాంటీన్లలో



ఆహార నాణ్యత బాగుందంటూ 80 శాతం మంది తమ సంతృప్తిని వ్యక్తం చేశారు.

తల్లికి వందనంతో సంతృప్తి..

అయితే నిన్నటి వరకు ఒక ఎత్తు.. నిన్నటి నుంచి మరో ఎత్తు అన్నట్టు ఉంది ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి శాతం. సూపర్ సిక్స్( %ంబజూవతీ ంఱఞ% ) పథకాల్లో ప్రధానమైనదిగా భావిస్తున్న తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి వర్తింపజేశారు. దీంతో ప్రజల్లో సంతృప్తి శాతం ప్రారంభం అయింది. విపక్షాల విమర్శలకు కూడా చె క్ పడింది. మరోవైపు ఇదే నెలలో అన్నదాతకు సుఖీభవ పథకం కూడా అమలు చేయనున్నారు.దీంతో కీలకమైన పథకాలకు సంబంధించి ప్రజల్లో మరింత సంతృప్తి శాతం పెరుగుతుందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కూడా ప్రారంభం కానుంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అభిప్రాయం మారుతూ వస్తుండడం గమనార్హం. ఒకవైపు అభివృద్ధి పనులు కొనసాగిస్తూనే సంక్షేమ పథకాలు అందించడం ద్వారా ప్రజల్లో సానుకూలత పెంచాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. మొత్తానికైతే ఏపీలో కూటమి ప్రభుత్వ పనితీరు పట్ల సంతృప్తి ప్రారంభం కావడం విశేషం.

# జాగృతి లీడర్లను తయారు చేసుకుంటున్న కవిత !

హైదరాబాద్,తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన పొలిటికల్ లాంచింగ్ భిన్నంగా ఉండేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముందుగా జాగృతిని బలోపేతం చేసుకుంటున్నారు. ప్రతి రోజూ..తెలంగాణ జాగృతి ఆఫీసులో చేరికలు జరుగుతున్నాయి. మరో వైపు కొత్తగా జాగృతిలో ఉండే వారికి ట్రైనింగ్ ప్రోగ్రాం ప్రారంభించారు. లీడర్ అనిపించుకోవాలంటే.. ఎలాంటి లక్షణాలు ఉండాలి, ఎలా ప్రజాపోరాటాలు చేయాలి.. అనే దానిపై ప్రత్యేకమైన శిక్షణా తరగతులను జాగృతి క్యాడర్ కు అందించాలని నిర్ణయించారు.పార్టీలోకి యువతను ఆకర్షించడానికి కవిత వ్యూహాత్మకంగా ముందడుగు వేస్తున్నారని అనుకోవచ్చు. బీఆర్ఎస్ తోసంబంధం లేకుండా కవిత జాగృతిని బలోపేతం చేసుకుని జాగృతి పేరుతోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొ నడం లేదు. కానీ మా పార్టీ బీఆర్ఎస్ అంటున్నారు. కేటీఆర్ ను కూడా మా వర్కింగ్ ప్రెసిడెంట్ అంటున్నారు.బీఆర్ఎస్ లో ప్రాధాన్యం లేకపోవడం వల్ల .. పార్టీ కార్యక్రమాలకు పిలవకపోవడం వల్ల కవిత సొంత రాజకీయాలు చేస్తున్నారు. ఈ అంశంపై కేసీఆర్ కు అసంతృప్తి ఉన్నా కవిత తగ్గడం లేదు. ఫామ్ హౌస్ కు వెళ్లినా కేసీఆర్ మాట్లాలడలేదు. దీంతో ఆమెకు కేసీఆర్ మద్దతు



లేదని చెబుతున్నారు. కానీ కవితపై చర్యలు తీసుకునే అవకాశం కనిపించడం లేదు. కవిత ఏదైనా సొంత రాజకీయ ప్రకటన చేస్తే అప్పుడు నిర్ణయం తీసుకుంటారని అంచనా వేస్తున్నారు.

# జీరో నుంచి మొదలు.. వైసీపీ ఏం చేయాలి ..!



అమరావతి,పజలు ఓడించి ఏడాది అయింది. మరో 4 సంవత్సరాల పాటు ఎన్నికలకు అవకాశం లేదు. మరి ఇప్పుడు ఏం చేయాలి? ఇదీ.. వైసీపీలో తలెత్తుతున్న ప్రశ్నలు. ఎందుకంటే.. ఒక్క ఏడాదిలోనే అనేక అరెస్టులు, అనేక మంది జంపింగులను పార్టీ చవి చూసింది. ఈ నేపథ్యంలో వచ్చే నాలుగు సంవత్సరాలు అంటే.. మరింత కష్టం. దీంతో పార్టీలో నాయకులు ఏం చేయాలన్నది ప్రశ్నగా మారింది. కానీ.. ఇక్కడే కీలక విషయాన్ని పార్టీ నాయకులు విస్మరిస్తున్నారు.ప్రస్తుతం వైసీపీ పరిస్థితి ఏమీ బాగోలేదు. అయితే.. రచ్చ లేకపోతే.. సైలెంట్ అన్నట్టుగానే నాయకులు వ్యవహరిస్తున్నారు. ఇక, బలమైన ప్రభుత్వ పక్షం కూడా వైసీపీని నిలువరించే ప్రయత్నం చేస్తోంది. ఇది రాజకీయంగా చేసే పనే. దీనిని ఎవరూ తప్పుపట్టాల్సిన అవసరం లేదు. అయితే.. వైసీపీ దూకుడు విషయంలో మార్పులు చేసుకుని.. జీరో నుంచి మొదలు పెట్టాల్సిన అవసరం ఉందని పరిశీలకులు చెబుతున్నారు. మార్పుల దిశగానే కాదు.. అసలు ఏమీలేదు.. అనుకుని ప్రారంభించాలని అంటున్నారు.గ్రామీణ స్థాయి నుంచే కాకుండా.. బూత్ లెవిల్ నుంచి కూడా పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అదేసమయంలో ప్రత్యర్థులు వేస్తున్న ముద్రల నుంచి కూడా బయటకు రావాల్సిన అవసరం కనిపిస్తుంది. గతంలోనే సైకో అంటూ.. జగన్‌పై పేరు పడింది. ఆనాడే ఆయన దీనిపై స్పందించి ఉంటే.. పరిస్థితి వేరేగా ఉండేది. కానీ, ఇప్పుడు ఇది గ్రామీణ ప్రాంతాలకు చేరిపోయింది. ఇక, అరాచక పార్టీ ముద్ర కూడా ఇబ్బంది పెడుతోంది. దీంతో విజ్ఞులు సైతం స్పందించలేని పరిస్థితి నెలకొంది.

## త్వరలోనే అధికారిక విధుల్లోకి మంత్రులు

హైదరాబాద్,తెలంగాణ మంత్రివర్గంలో కొత్తగా చేరిన మంత్రులకు సచివాలయంలో చాంబర్ల ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ జీఏడీ చాంబర్ల కేటాయింపుపై ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల మంత్రివర్గంలోకి తీసుకున్న అడ్లూరి లక్ష్మణ్‌కు సచివాలయ మొదటి అంతస్తులో 13, 14, 15, 16 నంబర్ గదులు కేటాయించగా, మంత్రి వివేక్ వెంకటస్వామికి రెండో అంతస్తులో 20, 21, 22 నంబర్ గదులు లభించాయి.

# సోకాల్డ్ సంపాదకులపై యనమల ఫైర్..!



అమరావతి, భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో వైఎస్సార్సిపికి అనుకూలంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంపై తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.తాము సీనియర్ సంపాదకులమంటూ సమావేశంలో పాల్గొన్న మీడియా ప్రతినిధులపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గతంలో వైఎస్సార్, జగన్ ప్రభుత్వాల హయాంలో మీడియా స్వేచ్ఛను తీవ్రంగా హరించినప్పుడు ఈ సోకాల్డ్ సంపాదకులు ఏమైపోయారని ప్రశ్నించారు.ఇప్పుడు మాత్రం భావ ప్రకటనా స్వేచ్ఛ పేరిట వైసీపీకి అనుకూలంగా మాట్లాడుతున్నారు. కానీ నాడు కొన్ని తదితర పత్రికలపై ప్రభుత్వం ఒత్తిడి తెస్తే వీరెవ్వరూ ఎందుకు స్పందించలేదు? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఉన్నప్పుడు మీడియా వాచ్ లాంటి నల్లచట్టాలను తీసుకువచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ, గతంలో ఓ మీడియా ప్రభుత్వాన్ని విమర్శించకుండా ఉండటమే కాక, ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకొని దుష్ప్రచారానికి పాల్పడిందన్నారు.ఇప్పుడు ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం, వ్యక్తిత్వ హనన వ్యాఖ్యలు చేయడం భావ ప్రకటనా స్వేచ్ఛ కిందకు రాదని గుర్తించాలి. రూల్ ఆఫ్ లా అన్నది ఆ యాజమాన్యానికి వర్తించదా? అని యనమల ప్రశ్నించారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలు ఉల్లంఘించిన నాటి వైఎస్, జగన్ ప్రభుత్వాలపై ఈ సంపాదకులు ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వాన్ని నిలబెట్టేందుకు వైస్సార్సీపీ అనుకూల మీడియా ఇప్పటికీ అధికార కోల్పోయిన తర్వాత కూడా ప్రజా ప్రతినిధులను అవమానించే విధంగా దుష్ప్రచారం చేస్తోందన్నారు. ఇదంతా భావ ప్రకటన స్వేచ్ఛ కింద ఎలా వస్తుంది? అసలు ప్రాథమిక విలువలపై ఈ సమావేశాల ద్వారా ఎలాంటి సందేశం వెళ్లుతోంది? అంటూ యనమల తన అభ్యంతరాలను స్పష్టంగా వ్యక్తపరిచారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com